www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 69 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె. ఉ. 6.28; దుర్ముహూర్తం: మ. 12.40-1.32, మ. 3.16-4.09; అమృతఘడియలు: మ. 2.54-4.36; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | తాడేపల్లిగూడెం సిటీ

Tadepalligudem | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024

Tadepalligudem | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తాడేపల్లిగూడెం సిటీ

12నే పాఠశాలల పునఃప్రారంభం : డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 9 : నిర్దీత అకడమిక్ కేలండర్ ప్రకారం వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12నే పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని డీఈవో అబ్రహం స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 12న పదవీ ప్రమాణ స్వీకారం చేయనుండడం, అదే రోజున పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో బుధవారం కాకుండా గురువారం పాఠశాలలను ప్రారంభించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో ఓ ప్రచారం జరుగుతోంది. దీనిపై డీఈవో వివరణ ఇస్తూ 'సంప్రదాయం ప్రకారం ఏటా వేసవిసెలవుల అనంతరం జూన్ 12న నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండడం రివాజుగా వస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువు తీరనున్న దృష్ట్యా పాఠశాలలను ఈ నెల 12న కాకుండా ఒకరోజు ఆలస్యంగా అంటే 13న తెరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎటువంటి అధికారిక ఉత్తర్వులు అందలేదు..' అని తెలిపారు.



భీమవరం పార్టీ కార్యాలయంలో కూటమి అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న వర్మ సతీమణి



పశ్చిమకు కమల కిరీటం

భూపతిరాజు శ్రీనివాస వర్మకు కేంద్ర మంత్రి పదవి



రాజమహేంద్రవరం ఎన్నికల ప్రచార సభకు విచ్చేసిన నరేంద్రమోదీ వేదికపై దూరంగా ఉన్న శ్రీనివాసవర్మను పిలిచి నరసాపురం పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాను గెలుస్తున్నట్లు వర్మ ఆయనకు చెప్పారు. "నువ్వు గెలిచిరా.. నీకు ఏం చేయాలో అది చేస్తా..." అంటూ మోదీ హామీ ఇచ్చినట్టు అప్పట్లో శ్రీనివాస వర్మ మీడియాకు చెప్పారు.. ఆ హామీ మేరకు మంత్రి పదవి ఇవ్వడం విశేషం.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

"నరసాపురం ఎంపీగా గెలిచిరా.. నీ సంగతి నేను చూసుకుంటా.." అని రాజమహేంద్రవరం ఎన్నికల సభలో ప్రధాని నరేంద్ర మోదీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు పెద్ద హామీనే ఇచ్చారు..ఇప్పుడది నిజం చేశారు. ఏకంగా కేంద్ర మంత్రి పదవే ఇచ్చారు. నరసాపురం ఎంపీగా శ్రీనివాసవర్మ భారీ మెజారిటీతో విజయం సాధించారు. ప్రధాని మోదీ అన్నట్టుగానే వర్మకు కేంద్ర మంత్రి వర్గంలో చోటు ఇచ్చారు. పార్టీకి విధేయునిగా

- ఆంధ్రప్రదేశ్ కోటాలో బీజేపీ తరపున ఎంపిక
- సామాన్య కార్యకర్త నుంచి మంత్రి వరకు
- పార్టీకి అత్యంత విశ్వాసపాత్రుడు
- కేంద్ర నాయకులతో సన్నిహిత సంబంధాలు

ఉండడంతో వర్మకు అదృష్టం వరించింది. నరసాపురం లోక్‌సభ టిక్కెట్ సాధించినప్పటి నుంచి మంత్రి వరకు అన్నీ ఆయనకు సునాయాసంగానే లభించాయి. తన ప్రయత్నాలన్నీ ఫలించాయి.మూడు దశాబ్దాలకు పైగా వర్మకు భారతీయ జనతా పార్టీతో అనుబంధం ఉంది. భారతీయ జనతా పార్టీ యువజన మోర్చా అధ్యక్షుడిగా వర్మ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి బీజేపీలో ఉంటూ పార్టీకి వివిధ హోదాల్లో సేవలందించారు. భీమవరం పట్టణ అధ్యక్షుడిగా సేవలందించారు. జిల్లా అధ్యక్షుడిగా పదేళ్లపాటు పార్టీ కోసం కృషి చేశారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా నర్సాపురం ఎంపీ సీటును వర్మ దక్కించుకున్నారు. భారీ విజయం సాధించారు. కూటమి శ్రేణులంతా వర్మ విజయానికి అలుపెరగని పోరాటం చేశాయి. కేంద్రమంత్రిగా బీజేపీ తరపున వివిధ పేర్లు వినిపించాయి. ముందునుంచి ఢిల్లీలో శ్రీనివాసవర్మ తన ప్రయత్నాలు సాగించారు. కేంద్ర పెద్దలతో సంప్రదింపులు చేశారు. మోదీ అభయం నెరవేరింది. వర్మ ప్రయత్నాలు ఫలించాయి. కేంద్ర మంత్రివర్గంలో చోటు లభించింది. పశ్చిమ గోదావరి జిల్లాకు అది వరం కానుంది. పెండింగ్ ప్రాజెక్ట్‌లన్నింటికీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి పూర్తి చేస్తామని ఎన్నికల్లో వర్మ హామీ ఇచ్చారు. మంత్రి వర్గంలో చోటు దక్కడంతో అవన్నీ ఇప్పుడు నెరవేరనున్నాయి.

ఉమ్మడి జిల్లా నుంచి కేంద్ర మంత్రులుగా..

ఉమ్మడి పశ్చిమ జిల్లా నుంచి కేంద్రమంత్రులుగా అతి కొద్దిమందికి మాత్రమే అవకాశం లభించింది. ఏలూరు నుంచి ఎంపీగా ఎన్నికైన బోళ్ల బుల్లిరామయ్య కేంద్రమంత్రిగా వ్యవహరించారు. అలాగే రాజ్యసభకు ఎంపికైన దాసరి నారాయణరావు -మిగతా 3లో..

20 ఏళ్ల తరువాత ..

నరసాపురం, జూన్ 9 : 20 ఏళ్ల తరువాత నరసాపురం పార్లమెంట్ పరిధి నుంచి ఎన్నికైన అభ్యర్థికి కేంద్ర మంత్రివర్గంలో స్థానం లభించింది. రాష్ట్ర విభజన తరువాత ఎంపీగా గెలుపొందిన శ్రీనివాసవర్మకే ఆ ఘనత దక్కింది. మరోవైపు పార్లమెంట్ ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు ఇద్దరికి మాత్రమే కేంద్ర మంత్రి వర్గంలో పదవులు దక్కాయి. అందులో తొలి మంత్రి అయిన ఘనత యూవీ కృష్ణంరాజుకు దక్కింది. 1999లో నరసాపురం పార్లమెంట్ నుంచి కృష్ణంరాజు బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించారు. 2000లో ఆయనకు కేంద్ర మంత్రివర్గంలో ఆహార సహాయ మంత్రి పదవి లభించింది. తరువాత ఏడాదికే రక్షణ సహాయ మంత్రి, మరోసారి విదేశీ వ్యవహారాల సహాయశాఖ మంత్రి పదవులు లభించింది. ఇలా ఐదేళ్లలో మూడు సార్లు మంత్రిగా కొనసాగారు. మళ్లీ 2024లో నరసాపురం నుంచి ఎన్నికైన శ్రీనివాసవర్మకు కేంద్ర కేబినేట్‌లో బెర్త్ దక్కింది.

భీమవరానికి తొలిసారిగా..

భీమవరం టౌన్, జూన్ 9 : నరసాపురం పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన భూపతిరాజు శ్రీనివాస వర్మకు కేంద్రమంత్రి పదవి దక్కడంతో పార్టీ కేడర్ సంబరాల్లో మునిగితేలుతోంది. పార్టీ విధేయుడుగా 34 ఏళ్ల పాటు ఆయన బీజేపీలో గుర్తింపు తెచ్చుకోవడంతో ఆయనను అందరూ బీజేపీ వర్మగా పిలుస్తుంటారు. నరసాపురం పార్లమెంట్ స్థానం నుంచి ఆయన 2 లక్షల 70 వేల మెజార్టీతో విజయపతాకం ఎగుర వెయ్యడంతో అధిష్టానంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇంతవరకు భీమవరానికి చెందిన వారు చాలామంది పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైనప్పటికీ ఎవరూ కేంద్ర మంత్రి పదవి దక్కించుకోలేకపోయారు. తొలిసారి 1999లో యూవీ కృష్ణంరాజుకు కేంద్ర మంత్రి పదవి లభించింది. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రిగా విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2014లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా గోకరాజు గంగరాజు ఎన్నికైనా ఆయనకు మంత్రి పదవి వరించలేదు.

విద్యార్థి స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు

సామాన్య ఎగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన శ్రీనివాసవర్మకు కేంద్రమంత్రి పదవి వరించడం వెనుక బీజేపీలో చేపట్టిన ఎన్నో బాధ్యతలు, ప్రతిపక్ష పార్టీగా చేసిన పోరాటాలు, పార్టీ పురోగతి కోసం చేసిన కృషి, శ్రమ దాగి ఉంది. వీరి తాత గారు భూపతిరాజు -మిగతా 3లో..

'ఆరోగ్యంపై ఆర్టీసీ సిబ్బంది అశ్రద్ధ వద్దు'



ఆర్టీసీకి మెడికల్ కిట్స్‌ను అందిస్తున్న వైద్యులు

భీమవరంటౌన్, జూన్ 8 : ఆరోగ్యంపై ఆర్టీసీ సిబ్బంది అశ్రద్ధ వహించకూడదని, బలమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ప్రముఖ వైద్యులు వీవీజే సోమరాజు, పి.బాలపరమేశ్వరరావు అన్నారు. భీమవరం ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో ఆర్టీసీ ఉద్యోగులకు సత్యం ఆర్థో పెడిక్, మాక్సీ విజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో డిపో మేనేజర్ వీఎస్ వీఎం సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల కోసం ఇటువంటి మెగా క్యాంప్‌లను నిర్వహించడం అభినందనీయమని, అన్ని బస్సుల్లోను మెడికల్ కిట్‌లను అందిస్తున్నామన్నారు. అనంతరం 200 మంది ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ఆర్టీసి డిపోకు వంద మెడికల్ కిట్‌లను అందించారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, మెకానిక్, సిబ్బంది ఆయా ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు

సంచార శకటంతో వైద్య సేవలు

తణుకు, జూన్ 9: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటం ద్వారా వృద్ధులకు వైద్య సేవలను నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నీలు మహేంద్ర, డాక్టర్ అస్మిత తణుకు, చివటం ప్రాంతాల్లో పర్యటించి అయిదుగురు వృద్ధులకు సేవలందించారు. డాక్టర్ కేవీ రావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్ష, కోశాధికారి అల్లూరి కరుణాకర్ చౌదరి, అర్జి భాస్కరరావు, సభ్యులు గిరజాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు త్వరగా చెల్లించాలి



మాట్లాడుతున్న రైతు నాయకులు

పెంటపాడు, జూన్ 9: రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు తక్షణం విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు చిర్లా పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు, బంకూరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పెంటపా డు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వారు మాట్లాడుతూ దాళ్వాలో పెట్టిన పెట్టుబడులే ఇంకా రైతుల చేతికి రాలేదని, ఇప్పుడు కొత్తగా సార్వా సీజన్‌కు పెట్టుబడులు పెట్టేందుకు స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

హామీ మేరకు రహదారికి మరమ్మతులు



పుంత రహదారికి మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

పెంటపాడు, జూన్ 9: మండలంలోని రాచర్ల గ్రామంలో పుంతరహదారి నిర్మాణం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చిన ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను పుంత రహదారి ఇబ్బందికరంగా ఉందని, మరమ్మతులు చేయాల్సిందిగా కొంతమంది రైతులు కోరగా స్పందించిన బొలిశెట్టి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మర మ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు ఎక్స్‌కవేటర్‌తో పుంతరహదారి మరమ్మతులు చేయించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి విజయోత్సవాలు

భీమవరంటౌన్, జూన్ 9 : భీమవరం పట్టణంలో 35వ వార్డులో జనసేన, టీడీపీ, బీజేపీ కొప్పినీడి బాబీ, పీవీటీ బ్రదర్స్ చిరుకూరి రామకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో విజయోత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహిం చారు కూటమి అభ్యర్థిగా గెలుపొందిన పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతు 35వ వార్డులో 1832 ఓట్లు మెజారిటీ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. వార్డులో తాగునీరు సమస్యగాని డ్రెయినేజీ సమస్య రానివ్వకుండ చూసుకుంటాను హామీ ఇచ్చారు. కోళ్ల నాగే శ్వరావు, సూర్యనారాయణరాజు, యర్రింకి సూర్యారావు, పోత్తూరి బాపిరాజు, ఉండపల్లి రమేష్ నాయుడు, భీమలా శ్రీరామమూర్తి, శ్రీనివాసరాజు, యాస అనిల్, కోళ్ల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

భీమవరం అర్బన్, జూన్ 9: వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం శ్రీరాంపురం నందలి గాంధీ కస్తూరీబా భవనమందు, మెంటే వారితోట నందలి సుందరయ్య భవనంలోను ఈనెల 12 నుంచి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్ శారీస్ నందు నైపుణ్యా శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు శిక్షణ పొందవచ్చన్నారు. వివరా లకు 86397 30222, 79894 92785 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వం త్వరగా ప్రజాసమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్, జూన్ 9: అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారాం అన్నారు. ఆదివారం కాంగ్రెసు పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత నూతన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. నియోజ కవర్గంలోని యనమదుర్రు డ్రెయిన్ ప్రక్షాళన, వాటిపై నిర్మించిన వంతెనలకు అప్రోచ్‌ల నిర్మాణం, టిడ్కో ఇళ్ల సమస్యలు, పోలవరం ప్రాజె క్టును పూర్తిచేయలన్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సోడాదాసి సెల్వియా, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు సోము నాగకేశవ్‌బాబు, చింత మహేష్, బోనం రవికుమార్, ఎంవీ రామరాజు, పీవీ దుర్గారావు, గౌరి నాయడు తదితరులు పాల్గొన్నారు.

'మంచి వ్యక్తిగా మారాలి'



మాట్లాడుతున్న డాక్టర్ హుస్సేన్

తణుకు, జూన్ 9: మనిషి దాడుల నుంచి బయట పడి మంచి వ్యక్తిగా మారాలని ప్రముఖ నేత్ర వైద్యులు డా.హుస్సేన్ అహ్మద్ అన్నారు. ఆదివారం ఇండియన్ పబ్లిక్ స్కూలు ఆవరణలో డాక్టర్ హుస్సేన్ రచించిన 'దేశ ప్రేమికులు ఎవరు? మస్తిష్క మథనం' పుస్తకావి ష్కరణ జరిగింది. పోలీసు వ్యవస్థ, చట్టం ఉన్నా ఉప యోగపడటం లేదన్నారు. భగవంతుడి ధర్మంలో మరణానంతర శిక్ష ఉందని భయపడితేనే గానీ మార్పు రాదన్నారు. అనంతరం పలువురు పుస్తకాన్ని ఆవిష్క రించారు. దారి దీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ, విశ్రాంత ప్రిన్సిపాల్ కొప్పర్తి రమణమూర్తి, రచయిత కానూరి బద్రీనాథ్, ఇండియన్ ఇస్లామిక్ అకాడమీ డైరెక్టర్ ముస్తాఖ్ అహ్మద్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి ట్రైసైకిల్ అందజేత

భీమవరం అర్బన్, జూన్ 9: విజ్ఞానవేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తట వర్తి వెన్నెల పుట్టిన రోజు సందర్భంగా దివ్యాంగునికి ట్రై సైకిల్‌ను అందించారు. ముఖ్యఅతిథిగా భీమవరం మానవతా సంస్థ అధ్యక్షుడు బుద్ద రాజు వెంకటపతిరాజు మాట్లాడుతూ నేటి యువత ఆదర్శభావాలతో తమ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని సమాజంలో అభాగ్యులకు, పేద లకు సాయం అందించడం అభినందనీయం అన్నారు. అల్లు శ్రీనివాస్, తట పర్తి శ్రీరామ పూర్ణచంద్రగుప్త, రాణి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత సత్తిరాజు మృతి

పాలకొల్లు అర్బన్, జూన్ 9 : పాలకొల్లు నియోజకవర్గం అరట్లకట్ట గ్రామానికి చెందిన సీపీఎం నేత కూనపరాజు సత్తిరాజు (80) ఆదివారం అనారోగ్యంతో మరణించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడడంతో కాలికి ఆపరేషన్ చేశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. భార్య సత్యవతి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సత్తిరాజు మృతికి సీపీఎం జిల్లా కమిటీ, సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణ రాజు రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారామ్, జుత్తిగ నరసింహమూర్తి, కేతా సూర్యారావు, వలవల శ్రీరామమూర్తి, బి.బలరామ్, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, జవ్వాది శ్రీనివాస్, అరట్లకట్ట రవి, సీహెచ్ సోమేశ్వరరావు తదితరుల సంతాపం వ్యక్తం చేశారు.

బ్రాహ్మణ చెరువు అధ్వానం



గొల్లలకోడేరులో అధ్వానంగా ఉన్న బ్రాహ్మణ చెరువు

- విష సర్పాలు సంచారం.. స్థానికులకు తప్పని ఇబ్బందులు
- చెరువును అభివృద్ధి చేయాలంటున్న గొల్లలకోడేరు గ్రామస్థులు

పాలకోడేరు, జూన్ 9 : గొల్లలకోడేరులో ఊరు నడిబొడ్డున ఒకప్పుడు సుందరంగా కనిపించే బ్రాహ్మణ చెరువు ప్రస్తుతం మురికికూపంగా తయారైంది. ఊరికి కూతవేటు దూరంలో ఉన్న పంటకాల్వకు అతిసమీపంలో చెరువుంది. ఒకప్పుడు ఈ చెరువు చూసేందుకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ఆ చెరువు చుట్టూ గృహాలు, ఆ గృహాలను ఆనుకుని చెరువుగట్టుపై రహదారి నాలుగువైపులా ఉండడంతో ఆ చెరువు చూసేందుకు అందంగా కనిపించేది. ఈ చెరువులోని నీటిని ఆ చుట్టుపక్కల ప్రాంత వాసులు వాడుకుంటూ ఉండేవారు. పంచాయతీ అధికారులు సైతం ఎప్పటికప్పుడు ఈ చెరువును బాగు చేస్తూ నలుగురికి ఉపయోగపడే విధంగా చూసేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ చెరువు పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఒకప్పుడు సుందరంగా ఉండే ఈ చెరువు ప్రస్తుతానికి ఈ చెరువును చూసేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ చెరువు చెత్తాచెదారంతో పాటు తూడు, జమ్ముగడ్డి పేరుకుపోయింది. పాములు పెరిగిపోయి రాత్రి సమయాల్లో ఆ చెరువుని ఆనుకుని ఉన్న గృహాల్లోకి వెళ్తుండటంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. సాయంత్రం సమయంలో ఆ ప్రాంతంలోని స్థానికులు ఆ చెరువు చుట్టూ వాకింగ్ చేస్తూ ఆనందాన్ని పొందేవారు. నేడు ఆ పరిస్థితి కనుమరుగైందని ఈ చెరువును బాగు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చెరువును అభివృద్ధి చేయాలి



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ చెరువు పరిస్థితి దారుణంగా తయారైంది. భీమవరానికి అతి చేరువలో గ్రామం ఉండటంతో ఎక్కడెక్కడి నుంచో వచ్చి గ్రామంలో స్థిరపడుతున్నారు. రానున్న రోజుల్లో తాగు నీటికి కూడా ఇబ్బందులుపడాల్సిన పరిస్థితి వస్తుంది. చెరువును అభివృద్ధి చేస్తే తాగునీటికి ఉపయోగించు కోవచ్చు. పంచాయతీ అధికారులు, పాలకులు చెరువుపై దృష్టి సారించి త్వరితగతిన అభివృద్ధి చేయాలి.

- కమ్మిలి రాంబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు

కేంద్రమంత్రిగా శ్రీనివాసవర్మ ఎంపికపై 'కూటమి' సంబరాలు



పెంటపాడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



ఢిల్లీలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మను సత్కరిస్తున్న జిల్లా బీజేపీ నాయకులు

భీమవరంటౌన్/నరసాపురం, జూన్ 9 : కేంద్ర సహాయమంత్రిగా భూపతిరా జు శ్రీనివాస్‌వర్మ నియమితులైన సందర్భంగా భీమవరంలోని బీజేపీ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన సతీమణి వెంకటేశ్వరిదేవి చేతుల మీదుగా కేక్ కట్ చేసి ఆమెకు గౌరవ సత్కారం చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త బీజేపీలో దీర్ఘ కాలం కష్టఫలితమే ఈ గుర్తింపు అని ఈ గెలుపునకు కారణం కార్యకర్తలేనని, ప్రజలకు ఎల్లవేళల రుణపడి ఉంటామన్నారు. ఢిల్లీలో ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్‌వర్మను జిల్లా పార్టీ నాయ కులు కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, పార్లమెంటు కన్వీనర్. పేరిచర్ల సుభాష్‌రాజు. తణుకు అసెంబ్లీ కన్వీనర్ అయినంపూడి శ్రీదేవి, రావూరి సుధాతోపాటు పలువురు నాయకులు అభినందన లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ కార్యకర్త స్థాయి నుంచి పార్టీలో పలువు పదవులను నిర్వర్తించి ఎంపీగా.. కేంద్ర మంత్రిగా. కీలక స్థానానికి చేరుకున్న శ్రీనివాస్‌వర్మ కృషి అందరికీ ఆదర్శమ న్నారు. నరసాపురం పట్టణంలోని బీజేపీ స్తూపం వద్ద స్థానిక నాయకులు కేక్ కట్ చేశారు. సెంటర్‌లో మిఠాయిలు పంచిపెట్టారు.

కూటమి నాయకుల సంబరాలు

పాలకొల్లు అర్బన్, జూన్ 9 : కేంద్రమంత్రి వర్గంలో నరసాపురం పార్లమెంట్ సభ్యుడు భూపతిరాజు శ్రీనివాసవర్మకు స్థానం లభించిన నేపథ్యంలో బీజేపీ, టీడీపీ, జనసేన శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లోని కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. బీజేపీ నాయకులు జక్కంపూడి కుమార్, కొల్లి కొండ, ప్రసాద్, బొడ సత్యకనకరాజు, బైలా శ్రీధర్, బి.మల్లికార్జునరెడ్డి, గంగా పవన్, టీడీపీ నాయకులు జీవీ, పెచ్చెట్టి బాబు, మహ్మద్ జానీ, శీరం ఆనంద కృష్ణ, గాదె వెంకన్న. అవినాష్, ధనాని ప్రకాష్, జి.సుబ్బారావు, ప్రవీణ్, జనసేన నాయకులు బోణం చినబాబు, సురేంద్ర, తుల రామలింగం, నర్సయ్య పాల్గొన్నారు.

- పెంటపాడు, జూన్ 9: ముదునూరు గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు దత్తు ప్రసాద్ అధ్యక్షతన కేక్ కట్‌చేసి, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకు న్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్ చౌదరి, ఇమ్మండి శ్రీనివాస్, ఆరాధ్యుల అంజి, గొర్రిపాటి సింహాచలం, బుద్దన నారాయణ, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు. పెంటపాడులో ఎంపీలు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ కేంద్రంలో మంత్రి పదవులకు ఎంపికవడం హర్షణీయమని టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ నాయకుడు దాసరి అప్పన్న అన్నారు. పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భారీ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. దాసరి కృష్ణవేణి, నల్లమిల్లి చినగోపిరెడ్డి, బండారు వెంకట్రావు, నక్కా సాంబశివరావు, చెప్పుల వాసు, శనగన శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లు టౌన్/ఉండి/పెనుమంట్ర/మొగల్తూరు/గణపవరం : పాలకొల్లు పట్టణ బీజేపీ కార్యాలయంలో బీజేపీ శ్రేణులు కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం బీజేపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, నాయకులు కొల్లి నర్సింహమూర్తి, కొల్లికొండ ప్రసాదు, బోడ కనకరాజు, టీడీపీ నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఉండిలో మండల బీజేపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గాదిరాజు వెంకటేశ్వరరాజు, కె.నాగబాబు, పతివాడ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు. పెనుమంట్ర మండలం పొలమూరులోని రావిచెట్టు సెంటర్‌లో ఉన్న బీజేపీ స్తూపం వద్ద సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లను పంపిణీ చేశారు. బీజేపీ గ్రామ అధ్యక్షుడు యామజాల విశ్వనాథ్, వాడపల్లి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు. మార్టేరు సెంటర్‌లో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ని ర్వహించారు. మొగల్తూరు మండలంలో బీజేపీ నాయకులు దాసరి బాబి, పుల పర్తి రమేష్, జనసేన జిల్లా నాయకుడు మేడిద బాబ్జి, లక్కు బాబి, కాళీపట్నం సర్పంచ్ మేడిద సౌజన్య ప్రభాకర్, మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరా జు, పట్టణ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలు, పాలా రాంబాబు, మామిడిశెట్టి స త్యనారాయణ, డొల్లా రత్నంరాజులు హర్షం ప్రకటించారు. గణపవరం మండలం పిప్పరలో మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రమంత్రిగా భూపతిరాజు శ్రీనివాసవర్మను ఎంపిక చేయడం శుభపరిణామం అన్నారు.
- ఆకివీడు : కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపట్టడంతో ఏపీ మంచి రోజులు మొదలయ్యాయని టీడీపీ మండల-పట్టణ అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. ఢిల్లీలో ప్రధాని మోదీ, మంత్రులు ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కూటమి శ్రేణులతో కలిసి కేక్ కట్‌చేసి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపు కున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు కౌన్సిలర్లు ఉన్నారు.



రామోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీతారామలక్ష్మి, వలవల బాబ్జి

రామోజీరావు మృతికి పలువురి సంతాపం

భీమవరం అర్బన్, జూన్ 9: ఈనాడు అధినేత రామోజీరావు మృతి పట్ల టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రగాడ సానుభూతిని తెలిపారు. భీమవరంలోని పార్టీ కార్యాలయంలో రామోజీ చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్షర యోధుడిగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. భీమవరంలోని వీరమ్మ పార్క్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద నందమూరి బాలకృష్ణ, ఎన్టీఆర్ అభిమాన సంఘం గౌరవాధ్యక్షులు మద్దుల రామ, రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం అధ్యక్షులు గంటా త్రిమూర్తులు ఆధ్వర్యంలో రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, కోళ్ళ నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు కోళ్ల సీతారాం, మైలాబత్తుల ఐజాక్‌బాబు, మాదాసు కనక దుర్గ, జంపన ధనరాజ్, నేదునూరి గంగాధర్ తిలక్, మలువలస రాము, కొండ్రు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

- పాలకొల్లు అర్బన్, : రామోజీరావు మృతికి పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు సంతాపాన్ని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ బాబ్జీ, అల్లు వెంకట సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ గాంధీ భగవాన్‌రాజు, వల్లభు నారాయణ మూర్తి, కర్నేన గౌరునాయుడు, పెచ్చెట్టి బాబు, కర్నేన రోజా రమణి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, సీనియర్ పాత్రికేయులు నరసింహరాజు, ముత్యాల శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, పీటీ తదితరులు సంతాపం తెలిపారు.
- తాడేపల్లిగూడెం అర్బన్ : ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి తీరని లోటని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, సుభద్ర, పసల కొండ తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లు టౌన్ : అక్షర యోధుడు రామోజీరావు మృతి ఉభయ తెలుగురాష్ట్రాల్లోని తెలుగు జాతికి తీరని లోటని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. హైదరాబాదులో రామోజీరావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



రామోజీ పార్థివదేహం వద్ద ఎమ్మెల్యే నిమ్మల నివాళి

ఎస్సీ, ఎస్టీ ఆక్వా రైతులకు సీఎంఎఫ్‌ఆర్ చేయూత

నరసాపురం రూరల్, జూన్ 9 : శాస్త్రవేత్తలు, సలహాలు పాటించి సాగు చేస్తే మంచి దిగుబడిని సాధించవచ్చని కేంద్ర ఆధీనంలోని సీఎంఎఫ్‌ఆర్ సంస్థ ప్రిన్సిపాల్ జోకి కిలాకుడేన్ చెప్పారు. ఆదివారం నవరసపురం గ్రామంలో ఆరు నెలల క్రితం ఎస్సీ, ఎస్టీ రైతులకు ఇచ్చిన మత్స్య సంపద దిగుబడిని పరిశీలిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఆక్వా సాగు చేసేందుకు ఆసక్తి చూపితే వారికి ఉచిత సలహాలు, సూచనలతో పాటు సీడ్‌ను అందిసా మన్నారు. సబ్సిడీపై ఫీడ్ కూడా ఇస్తామన్నారు. రాష్ట్రంలో విశాఖ కేంద్రంగా తమ సంస్థ పని చేస్తుందన్నారు. నాగరాజు, వంశీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లయనిజమంటేనే సేవాతత్వం : శ్రీశాంతి



లయన్స్ వ్యవస్థాపకుడుకి లయన్స్ ప్రముఖుల నివాళి

ఆకివీడు, జూన్ 9: లయనిజమం టేనే సేవాతత్వ మని మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లయన్ డామెర్ల శ్రీశాంతి అన్నారు. ఆకివీడు ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలుగా కాకర్ల రాజరాజేశ్వరి, కార్యదర్శిగా మోరా జ్యోతిరెడ్డి, కోశాధికారిగా ఎంవీఎస్ నాగమణిలతో ఆదివారం స్థానిక వి-కన్వెన్షన్‌లో ప్రమా ణస్వీకారం చేయించి మాట్లాడారు. ఆకివీడులో లయన్స్ తరపున చేస్తున్న సేవా కార్యక్రమాలు,శాశ్వత ప్రాజెక్టుల నిర్మాణాలు బాగున్నాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ గట్టి మాణిక్యాలరావు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు ఎంవీఎస్ రాజు, సీహెచ్ కృష్ణంరాజు, జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్వీఎస్ సూర్యనారాయణరాజు, రీజియన్ చైర్‌పర్సన్ గొంట్లా కృష్ణమూర్తి, జోన్ చైర్‌పర్సన్ మద్రివాడ శ్రీనివాస రావు, ప్రముఖులు నేరెళ్ళ రామ చెంచయ్య, గుర్రం శ్రీనివాసరావు, పేర్ని సుబ్ర హ్మణ్యం, తదితరు లు ఉన్నారు.

12 నుంచి అన్న క్యాంటీన్

ఆకివీడు, జూన్ 9:ఆకివీడు దొరగారి చెరువు వద్ద ఈనెల 12న అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్నామని టీడీపీ సీనియర్ నా యకుడు గొట్టుము క్కల వెంకట సత్య నారాయణరాజు ఆదివారం తెలిపారు. టీడీపీ పాలనలో అన్నక్యాంటీన్లు నిర్వ హించేవారని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బంద్ చేసిన సంగతి తె లిసిందే. అప్పుడు ఆకివీడులో అన్న క్యాంటీన్ ని ర్వహిం చేవారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికా రికంగా ఏర్పాటుచేసే వరకు సొంత ఖర్చు లతో క్యాంటీన్ నిర్వహిస్తామన్నారు. నగర పంచాయతీకి దరఖాస్తు చేశామ న్నారు. పేదలకు మళ్లీ మంచి రోజులు వ చ్చాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆరిమిల్లి రాధాకృష్ణకు భారీ మెజార్టీ

రికార్డు స్థాయిలో 72,121





భారీ మెజార్టీ సాధించిన సంఖ్యతో కేక్

తణుకు, జూన్ 9: తణుకు నియోజకవర్గం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆరిమిల్లి రాధాకృష్ణ భారీ మెజార్టీ కైవశం చేసుకున్నారు. ఉభయ గోదావరి జిల్లాలోనే అందరి కన్నా ఎక్కువ ఓట్లు సాధించారు. తణుకు నియోజకవర్గంలో అయితే ఇక భవిష్యత్‌లోనే ఏ ఒక్కరికి సొంతం కాని మోజార్టీ సాధించారు. ప్రతి రౌండులోను అత్యంత భారీ మెజార్టీతో ఆరిమిల్లి దూసుకు పోయారు. మండలాల నుంచి 71,059 ఓట్ల మెజారిటీ రాగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా కలిపి 72,121 ఓట్ల రికారుడ మెజారిటీ లభించింది. తణుకు నియోజకవర్గంలో, పట్టణంలోని వార్డులు, పార్టీల వారీగా వచ్చిన ఓట్లు, మెజార్టీ వివరాలివి..

వార్డు	టీడీపీ	వైసీపీ	మెజార్టీ
1	1464	390	1074
2	1492	503	989
3	1335	467	868
4	1268	453	815
5	1477	665	812
6	904	876	28
7	1108	507	601
8	1291	422	869
9	532	195	337
10	1269	296	973
11	1333	420	913
12	903	868	35
13	880	916	-36
14	1429	487	942
15	813	863	-50
16	1021	411	610
17	1023	462	561
18	1030	464	566
19	1275	155	1020
20	1113	273	840
21	811	169	645
22	1305	390	915
23	1410	285	1125
24	935	275	660
25	810	278	532
26	1496	457	1042
27	1432	360	1072
28	2085	420	1665
29	856	233	623
30	1183	439	744
31	1183	366	733
32	1154	427	727
33	1451	348	1103
34	1093	363	730
మొత్తం	40,086	15,003	25,083

తణుకు మండలం

గ్రామం	టీడీపీ	వైసీపీ	మెజార్టీ
దువ్వ	6429	2588	3841
ముద్దాపురం	1271	700	571
కోనాల	768	627	141
తేతలి	3644	1943	1701
మండపాక	3697	1875	1822
వేల్పూరు	10111	3866	6245
మహాలక్ష్మిచెర్వు	740	348	392
కొమరవరం	1838	783	1055
మొత్తం	28,498	12,730	15,768

అత్తిలి మండలంలో

గ్రామం	టీడీపీ	వైసీపీ	మెజార్టీ
తిరుపతిపురం	1411	934	477
వరిఘేడు	2151	1302	849
గుమ్మంపాడు	926	438	488
బల్లిపాడు	2115	858	1257
అత్తిలి	9629	2983	6646
కె.ఎస్‌గట్టు	789	539	250
ఉరదాళ్ళపాలెం	1568	527	1041
పాలూరు	1236	816	420
కొమ్మర	905	818	87
ఈడూరు	1047	578	469
కంచుమర్రు	823	524	299
స్కిన్నెరపురం	946	430	516
ఉనికిలి	1171	516	655
లక్ష్మీనారాయణపురం	1169	705	464
ఆరవల్లి	1154	1145	9
దంతుపల్లి	412	166	246
మంచిలి	2337	1002	1335
పాలి	747	793	-46
మొత్తం	30,536	15,074	15,462

ఇరగవరం మండలం

గ్రామం	టీడీపీ	వైసీపీ	మెజార్టీ
రేలంగి	6906	2491	4415
కావలిపురం	1022	886	136
గోటేరు	1039	537	502
కె.ఇల్లింద్రపర్రు	2172	921	1251
తూర్పువిప్పర్రు	2547	871	1676
కె.కుముదువల్లి	1139	329	810
పేకేరు	1760	911	849
రాపాక	727	496	231
సూరంపూడి	681	525	156
ఇరగవరం	2629	1312	1317
యార్రయిచెర్వు	342	244	98
అనుపోజిపాలెం	1120	546	574
కొత్తపాడు	791	251	540
కంతేరు	951	673	278
పొదలాడ	389	174	215
కత్తవపాడు	812	357	455
కాకిలేరు	1149	524	625
అయినపర్రు	725	617	108
ఓగిడి	682	392	290
అయింపూడి, ఏలేటిపాడు	1251	1031	220
మొత్తం	28,834	14,088	14,746

కూటమి హామీలన్నీ అమలు చేస్తాం

శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

నరసాపురం రూరల్, జూన్ 9: ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలన్నింటిని నూటిని నూరుశాతం చంద్రబాబు అమలు చేస్తారని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. ఆదివారం మండలంలోని మల్లవరం, మల్లవరంలంక గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సెంటర్‌లో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు విసుగుచెందటం వల్లే ఓటర్లు కూటమికి భారీ విజయాన్ని అందించారన్నారు. సమష్టి కృషి వల్లే బొమ్మిడి నాయకర్ విజయం సాధించారన్నారు. ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నదే ప్రభుత్వ లక్ష్య మన్నారు. అనంతరం ఎంపీ శ్రీనివాసవర్మను కలిసి బొకే అందించారు. వాతాడి ఉమా, రామకృష్ణ, ఆధికారి అనంత రామారావు, కొల్లు పెద్దిరాజు, సావిత్రి పాల్గొన్నారు.



వీరపేరంటాలమ్మ ఆలయంలో అన్నసమారాధన

కూటమి విజయంతో మొక్కులు చెల్లించుకున్న టీడీపీ శ్రేణులు

ఉండి, జూన్ 9 : కూటమి విజయంతో వారు అనుకున్న మొక్కుబడిని పాందువ్వ గ్రామానికి చెందిన దేశం నాయకులు చెల్లించుకోవడం అభినందనీయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అన్నారు. ఆదివారం వెలివర్రులోని వీరపేరంటాలమ్మ ఆలయంలో పాందువ్వ గ్రామానికి చెందిన ఎంఎస్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆరువేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, పాందువ్వ కలిగొట్ల, ఉండి, వెలివర్రు తదితర గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలేరమ్మ సన్నిధిలో..

పోడూరు, జూన్ 9 : ఎన్నికల్లో కూటమి గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ జిన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యలకల శ్రీను దంపతులు గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి చలివిడి పానకాలు కావిళ్లు తీసుకొస్తానని మొక్కుకున్నారు. ఈ మేరకు శ్రీను దంపతులు ఆదివారం మేళతాళాలతో, బాణసంచా కాల్పులతో చలివిడి పానకాలు కావిళ్లు తీసు కొని పోలేరమ్మ ఆలయానికి వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాదు, శ్రీరామకోటి మోహన్ సోదరులు, నాయకులు పాలవలస తులసీరావు, గుబ్బల శ్రీరామ్, సంఖు సుబ్రహ్మణ్యం, బూర్లు సత్యనా రాయణ గిరిగి గోపాలకృష్ణ, జడ్డు సూరి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో వైసీపీ అభిమాని ఆత్మహత్య


గుర్రం శ్రీనివాస్ (ఫైల్)

టి.నరసాపురం, జూన్ 9: వైసీపీ ఓటమికి మనస్తాపంతో ఆ పార్టీ అభిమాని గుర్రం శ్రీనివాస్ (24) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పుట్రేపులో ఆదివారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వైసీపీ అభిమానిగా ఉన్న శ్రీనివాస్ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఘోర ఓటమి పాలవ్వడంతో తీవ్ర మనస్థాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాస్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న శ్రీనివాస్ మృతి చెందడంతో దిక్కుతోచని స్థితిలో భార్య, ముగ్గురు చిన్నారులు రోదిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి


మృతుడి ఇంటి వద్ద విచారణ చేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్ పోలీసులు

జీలుగుమిల్లి, జూన్ 9 : దర్భగూడెంలో ఉరివేసుకుని యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన బత్తుల వీరభద్రస్వామి (32) ఎవరు లేని సమయంలో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ వి.చంద్రశేఖర్ పరిశీలించారు. మృతుడి తల్లి ప్రభావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటున్న వీరభద్రస్వామి రెండు రోజుల క్రితం పోగాకు ముఠా మేస్త్రీతో కూలీ డబ్బుల విషయమై గొడవ పడ్డాడని స్థానికులు చెబుతున్నారు. ఆత్మహత్యకు గల కారణాల్ని పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య


వీరవల్లి దుర్గారావు(ఫైల్)

యలమంచిలి, జూన్ 9: పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం గ్రామానికి చెందిన వీరవల్లి దుర్గారావు(30) చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదివారం ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. తాపీ పనిచేస్తూ జీవనం సాగించే దుర్గారావు కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం సాయంత్రం దుర్గారావు చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఉంటాడన్న సమాచారంతో అతని బంధువులు, పోలీసులు అతని ఆచూకీ కోసం ఆదివారం గోదావరిలో గాలింపు చేపట్టగా సాయంత్రం మృతదేహం లభ్యమైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య ఉంది.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలు

ఉంగుటూరు, జూన్ 9 : జాతీయ రహదారిపై ఉంగుటూరు మండలం కైకరం వద్ద ఆదివారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. దీంతో గణపవరం మండలం అగ్రహారం గోపవరం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ తలకు తీవ్ర గాయం కావడంతో హైవే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేసి తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మరో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 9 : భర్తతోపాటు అత్తింటివారు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అత్తింటివారిపై కేసు నమోదు అయింది. ఏలూరులోని శనివారపుపేటకు చెందిన బయ్యారపు ప్రశాంతి (27)కి ఆరేళ్ల క్రితం నాగార్జునతో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చెడు వ్యసనాలకు బానిస అయిన నాగార్జున ప్రతి రోజు ప్రశాంతిని శారీరకంగా, మానసికంగా అతనితో పాటు బావ వినోద్, అత్త విజయకుమారి, ఆడపడుచు డోలా శ్రీలక్ష్మి వేధిస్తున్నారు. వారి వేదింపులు భరించలేక ఆమె పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. దీంతో ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. భర్తతోపాటు బావ వినోద్, అత్త విజయకుమారి, శ్రీలక్ష్మిపై దర్యాప్తు చేపట్టారు.

అన్నప్రాసన రోజే అనంతలోకాలకు...

- రోడ్డు ప్రమాదంలో బాలుడితో సహా అమ్మమ్మ మృతి
- ఎనిమిది మందికి గాయాలు



మృతులు హియాన్ సాయిసింగ్, బొందిలి సునీతాభాయ్.. క్షతగాత్రుడు నాగరాజు నుంచి వివరాలను తెలుసుకుంటున్న సీఐ రామకృష్ణ

నూజివీడు టౌన్, జూన్ 9: ఆరు నెలలు నిండకుండానే ఆ చిన్నారికి నూరేళ్లు నిండాయి. చిన్నారి అన్న ప్రాసన కోసం వచ్చిన అమ్మమ్మ కూడా మృతి చెందడం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. మచిలీపట్నం చిన్నాపురానికి చెందిన బొందిలి నాగరాజు మనుమడు హియాన్ సాయిసింగ్ అన్నప్రాసనకు తన తండ్రిగారి ఊరైన ఏలూరు జిల్లా నూజివీడుకు వచ్చి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడితో పాటు అతని అమ్మమ్మ మృతి చెందగా, మరో ఎనిమిది మంది గాయాలపాలైన ఘటన నూజివీడు మండలం గొల్లపల్లిలో చోటు చేసుకుంది. హియాన్ సాయిసింగ్ అన్నప్రాసనను ఆదివారం నూజివీడులో నిర్వహించారు. అన్నప్రాసన పూర్తి అయిన అనంతరం ఆటోలో తిరిగి చిన్నాపురం వెళుతుండగా మృత్యు రూపంలో వచ్చిన బొలేరో వీరు ప్రయాణిస్తున్న ఆటోను గొల్లపల్లి వద్ద బలంగా ఢీ కొట్టింది. దీంతో చిన్నారి హియాన్ సాయిసింగ్ (ఆరు నెలలు)తో పాటు బొందిలి సునీతా బాయ్ (48) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వీరితో పాటు చిన్నాపురానికి చెందిన బొందిలి నాగరాజు, బొందిలి సునీత, బొందిలి సంతోషి బాయి, బొందిలి హిమాబాయ్, క్షత్రియ శైలజా బాయ్, ఆటోడ్రైవర్ మూర్ల నాగరాజు, పాముల భరత్‌కుమార్ తీవ్రంగా గాయపడగా వారిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు రిఫర్ చేశారు.

పలుమార్లు ఢీ కొన్న బొలేరో..

బొలేరో డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా వాహనాన్ని నడుపుతూ ఆటోను ఢీకొన్నాడు. పల్టీకొట్టిన ఆటోను పలుమార్లు బొలేరో వాహనం ఢీకొని ముందుకు వెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు. ఫలితంగానే చిన్నారి, అమ్మమ్మ సునీతాబాయి మృతి చెందారని పేర్కొంటున్నారు. ఈ ఘటనా స్థలం పక్కనే ఉన్న చికెన్ కొట్టు వద్దకు వచ్చిన వేంపాడుకు చెందిన పామర్తి ధనుష్ సైతం గాయపడ్డాడు. నూజివీడు రూరల్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

గణపవరం, జూన్ 9: సరిపల్లెలోని రొయ్యల మేతల తయారీ ఫ్యాక్టరీని తక్షణమే తెరవాలని తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలని, రావల్సిన వేతనాలు పూర్తి స్థాయిలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ 3వ రోజు ఆదివారం ఉద్యోగులు, కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. థాయిలాండ్ దేశానికి చెందిన యాజమాన్యం నష్టాల్లో ఉందన్న సాకుతో ఫ్యాక్టరీని మూసివేసి కార్మికులను రోడ్డు పాలు చేశారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కొంత కాలంగా తమకు జీతాలు ఇవ్వకపోవడం, పని చూపకపోవడంతో మనుగడే ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి అధికారులు నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

మందు బాబుల వికృత చేష్టలు

- తాగేసిన మద్యం సీసాలు పొలంలో వేస్తున్న వైనం
- సీసా పెంకులు గుచ్చుకొని గాయాలపాలవుతున్న అన్నదాతలు


పంట పొలాల్లో తాగి పడేసిన మద్యం సీసాలు, సీసాలను ఏరి పొలం గట్టున వేసిన రైతులు(ఇన్‌సెట్)

పెదపాడు, జూన్ 9 : వారంతా కాయకష్టాన్నే నమ్ముకుని నిత్యం వ్యవసాయ క్షేత్రంలో స్వేదం చిందించి పంటలు పండించే రైతన్నలు. అలాంటి రైతన్నల నెత్తుటితో నేల తడిచేలా చేస్తున్న మందు బాబుల ఆగడాలు రోజు రోజుకూ పెరిగిపోతుండడంతో పలువురు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. తొలకరి వర్షాలు కురుస్తుండడంతో మరికొన్ని రోజుల్లో సాగు పనులు మొదలెట్టేందుకు రైతులు సమాయత్త మవుతున్నారు. ఇక్కడే వారికో చిక్కొచ్చి పడింది. గ్రామాలను ఆనుకుని రహదారుల పక్కల ఉన్న పంట పొలాల వద్ద రాత్రిపూట మందుబాబులు మద్యం సేవించి ఆ ఖాళీ సీసాలను పొలాల్లోకి విసిరేస్తున్నారు. వాటిల్లో కొన్ని మద్యం సీసాలు బద్దలై గాజుపెంకులు ఆ ప్రాంతమంతా చెల్లాచెదురుగా పడుతున్నాయి. దుక్కి దున్ని, నీరు పెట్టి సాగు కోసం రైతన్నలు, నాటు వేసేందుకు మహిళా కూలీలు పొలంలో దిగిన సమయంలో గాజు పెంకులు కాళ్లకు గుచ్చు కుని గాయాలపాలవుతున్నారు. దీంతో రైతులు పొలం పనుల కోసం పొలంలోకి దిగాలంటేనే భయపడుతున్నారు. చేసేది లేక రోడ్డు పక్క పొలాల రైతులు సాగుకు ముందుగానే పొలంలో మద్యం సీసాలను పనికట్టుకుని ఏరి బయట పారబోస్తున్నారు. ఇలా చేయవద్దని సాయంత్రం పూట రోడ్డు పక్కల మద్యం తాగే మందుబాబులకు చెబుతున్నా తిరిగి మాపైనే గొడవకు దిగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇటువంటి వారిని అడ్డుకునేందుకు పోలీసులు, ఆయా గ్రామాల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

బీచ్ వద్ద సందడే సందడి



మొగల్తూరు, జూన్ 9 : కేపీపాలెం, పేరుపాలెం సాగర తీరాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. మరి కొద్ది రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు తెరవనున్నందున విద్యార్థులు, యువకులు వారి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి అహ్లాదంగా గడిపారు. తీరం వెంబడి గల కొబ్బరి, సరుగుడు తోటల్లో ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం తీరం వెంబడి గల పాండురంగస్వామి, వేళ్లాం కిణ్జీ మాత, షిరిడి సాయి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, అష్టలక్ష్మీ దశావతార మత్స్యనారాయణస్వామి ఆలయాలను దర్శించుకున్నారు.

కిటకిటలాడిన చినవెంకన్న సన్నిధి


క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు


శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ద్వారకాతిరుమల, జూన్ 9: ద్వారకా తిరుమలేశుని దివ్యసన్నిధి భక్తులతో నిండిపోయింది. ఆదివారం సెలవు రోజు కావడం వల్ల ఆలయానికి విశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తుల రాకతో ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి. దాదాపు 15 వేలకు పైబడి యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది దర్శనానంతరం వారు స్వామి వారి ఉచిత తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.

శ్రీవారి సేవలో అవనిగడ్డ ఎమ్మెల్యే

చిన్నతిరుమలేశుని అవనిగడ్డ ఎమ్మెల్యే(జనసేన) మండలి బుద్దప్రసాద్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనాన్ని అందించారు. ఏఈఓ దుర్గారావు ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

ముగిసిన అంతర్జాతీయ చదరంగం పోటీలు



చదరంగం విజేతలతో నిర్వాహకులు

భీమవరం అర్బన్, జూన్ 5: కాస్మో స్పోర్ట్స్ ట్రస్ట్, అనసూయ చెస్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఆరు రోజులు జరిగిన ఇంటర్‌నేషనల్ ఓపెన్ ఫైడ్ రేటింగ్ చెస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలకు దేశ, విదేశాల నుంచి 273 మంది క్రీడాకారులు పాల్గొన్నారని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. ఈ పోటీలలో మొదటి బహుమతిని అఫ్రీద్‌టి.ఖాన్ (ధర్మవరం) రెండో బహుమతి జ్ఞాన సాయి సంతోష్ (కాకినాడ) మూడో బహుమతి కుషాల్ (అనంతపురం) నాల్గో విజేతగా భరత కుమార్ రెడ్డి (హైద్రాబాద్) నిలిచారన్నారు. విజేతలకు రూ.ఐదు లక్షల నగదు బహుమతిని క్లబ్ కార్యదర్శి పీవీ రామరాజు చేతుల మీదుగా అందజేశారని కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు, జిల్లా చెస్ క్రీడాకారులు తోట హరిబాబు, ఎం.మురళీ, ఉదయ్‌కుమార్, రామసుబ్బారెడ్డి, టి.నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మాన్ని తెలుసుకోవడానికి ప్రమాణం వేదమొక్కటే

ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు


ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు(ఇన్‌సెట్), వింటున్న భక్తులు

పెదపాడు, జూన్ 9 : ధర్మాన్ని తెలుసుకోవడానికి ప్రమాణం వేదమొక్కటేనని, మనిషి సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ ఆధ్యాత్మిక భావనల వైపు ముందు తరాలను నడిపించాల్సిన అవసరముందని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. పెదపాడు మండలం అప్పనవీడులోని ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం చాగంటి ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈశ్వరుడు వర్తమానంలో ఇచ్చినవాటితో తృప్తిగా ఉండాలని, లేనివాటి కోసం జీవితాన్ని అంధకారం చేసుకోకూడదన్నారు. అధ్యాత్మిక చింతనలతో, ఓర్పుతో జీవితాన్ని ముందుకు తీసుకెళ్లిన వ్యక్తి విశేషాభరణాలను ధరించినట్లన్నారు. మనల్ని మనమే మార్చుకోవాలని, నీ జీవితాన్ని ఎవ్వరూ మార్చరని, ఆ ప్రయత్నంలో దేవుని సాయం కోరుతూ భక్తిపూర్వకంగా ప్రార్థన చేయాలని చాగంటి కోటేశ్వరరావు ప్రవచించారు. అనంతరం పలువురు భక్తులు అడిగిన అధ్యాత్మికత సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసరావు, దేవాలయ సిబ్బంది, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేషన్ వాహనంపై జగన్ స్టిక్కర్ తొలగింపు



యలమంచిలి, జూన్ 9: టిడిపి, జనసేన, బిజెపి కూటమి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో యల మంచిలి గ్రామంలో ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ చేసే వ్యాన్‌పై ఉన్న జగన్ బొమ్మలను కూటమి శ్రేణులు ఆదివారం తొలగించారు. అంతేకాక వ్యాన్‌పై టిడిపి, జెఎస్‌పి అని రాశారు. ఎండియూ వ్యాన్‌పై జగన్ బొమ్మను తొలగిం చడం గ్రామంలో చర్చనీయాంశమైంది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన తరువాత కూడా జగన్ బొమ్మలు దేనికంటూ పలువురు గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు.

సీఐ సెలవు అందుకేనా..!


యువగళం వలంటీర్లను పరామర్శిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమ (ఫైల్)

భీమవరం క్రైం, జూన్ 9 : భీమవరం సబ్ డివిజనల్ పరిధిలోని ఒక పోలీస్‌స్టేషన్ సీఐ కొద్ది రోజులుగా సెలవుపై వెళ్లారు. దీంతో ఆ స్టేషన్‌తో పాటు ఆ ప్రాంతమంతా పలు రకాలుగా చర్చ జరుగుతుంది. గతేడాది సెప్టెంబర్‌లో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జరుగుతున్న నేపథ్యంలో కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లతో, కర్రలతో యువగళం కార్యకర్తలపై దాడి చేశారు. దీంతో ఆ సమయంలో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. చివరకు యువగళం వలంటీర్లపై ఎటువంటి చర్యలు లేవు ఆ సమయంలో వైసీపీ నాయకులకు కొమ్ము కాసి ఒక ప్రభుత్వ ఉద్యోగిలా కాకుండా ఒక కార్యకర్తలా వ్యవహరించిన ఆ సీఐ ప్రస్తుతం సెలవుపై వెళ్లడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ సీఐ క్రిందస్థాయి కొం దరు సిబ్బంది మాత్రం అతని తండ్రికి అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారని చెబుతున్నారు. ఏది ఏమైనా లోకేష్ పాదయాత్ర సమయంలో చేసిన కొన్ని వ్యవహారాలు వల్ల తనపై ఎటువంటి చర్యలు ఉంటాయో అని ఊహించిన ఆ అధికారి సెలవుపై వెళ్లారని కొందరు చర్చించడం హాట్ టాపిక్‌గా మారింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సమితి సభ్యులు

పెనుగొండ, జూన్ 9 : సిద్ధాంతం గ్రామంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. హిందూ ధర్మాన్ని పాటిస్తూ, ఆరోగ్యకుటుంబం, నైతిక విలువలు పెంపొందించాలని ఏడాది క్రితం ఏర్పాటు చేసిన హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఈ సంవత్సర కాలంలో ఎన్నో ఆధ్యాత్మికమైన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ పౌర్ణమి రోజు గోదావరి హారతి, నగర సంకీర్తన, రాష్ట్రంలో పేరుగాంచిన ప్రవర్తలతో ప్రవచనాలు ఇలా హిందూ సాంప్రదాయం ఉట్టిపడేటట్లు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మదర్స్ డే సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన మహిళలకు పసుపు, కుంకుమ, పండ్లు, రవికలు పంపిణీ చేశారు.

చిన్నారుల కూచిపూడి నృత్యం


సాంస్కృతిక ప్రదర్శన

ఈ ప్రథమ వార్షికోత్సవంలో స్థానికంగా ఉన్న చిన్నారులతో ఏర్పాటైన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతుల్ని ఆకటుకుంది. రవీంద్ర భారతిలో నంది అవార్డు పురస్కారం పొందిన కోమలి ప్రదర్శించిన కుచిపూడి నృత్యం వీక్షించిన పేక్షకుల్ని తన్మయుల య్యారు. అనంతరం సమితి సభ్యులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు యక్కల త్రిమూర్తులు, జయవరపు నానాజీ, చోడవరపు శ్రీను, కీళ్ళ భద్రయ్య, పొన్నాడ పల్లపరాజు, జయవరపు నానాజీ, మానేపల్లి పురుషోత్తం అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ



ర్యాంకు పొందిన విద్యార్థులు

భీమవరంటౌన్,జూన్ 9 : జేఈఈ అడ్వాన్స్ నిర్వహించిన ఐఐటీ (మద్రాసు) పరీక్షల్లో భీమవరం బ్రాంచి నుంచి 30 మందికి పైగా ర్యాంకులు సాధించారని సంస్థ డైరెక్టర్లు ఎస్.సాయి రాజు, పి.శ్రీనివాసవర్మ, జి .సతీష్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ విద్యా సంస్థల నుంచి ఆల్ ఇండియా 62వ ర్యాంకు, 193వ ర్యాంకు, 242వ ర్యాంకు, 440వ ర్యాంకు, 582, 689, 713, 803, 911, ర్యాంకులు సాధించారని, ఈ అవార్డులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

నిశాంత్‌కు 126వ ర్యాంక్



పెనుగొండ, జూన్9 : జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో పెనుగొండ భాష్యం విద్యార్థి నెక్కంటి నిశాంత్ ఆలిండియా 126వ ర్యాంక్‌తో సంచలన విజయం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్‌వీ అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నిశాంత్‌కు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా నిశాంత్‌ను భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, సీఈవో హనుమంతరావు, జోన్ ఇన్‌చార్జి శ్రీమన్నారాయణ రెడ్డి తదితరులు అభినందించారు.

బండి ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు, జూన్ 9 : ముత్యాలపల్లిలో వేంచేసివున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన ప్రాంతంతో పాటు సరిహద్దు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు వారి బంధు మిత్రులకు ఆలయం వద్ద విందు ఏర్పాటు చేశారు. భక్తులకు కావల్సిన సదుపాయాలను ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ సిబ్బంది కల్పించారు.

హరిత కొల్లేరు రిసార్ట్స్‌పై ఎక్సైజ్ అధికారుల దాడి

- 323 అక్రమ మద్యం బాటిల్స్ స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు


ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఏలూరు క్రైం, జూన్ 9 : ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 213లో ఈ టూరిజం రిసార్ట్‌ను హరిత కొల్లేరు రిసార్ట్స్ పేరుతో మద్యం విక్రయాలకు కూడా లైసెన్సు పొందారు. అయితే ఏపీఎస్‌బీసీఎల్ డిపో నుంచి ఫుల్ మద్యం బాటిల్స్, బీరు బాటిల్స్ కొనుగోలు చేసి ఇక్కడ లూజుగా విక్రయించాల్సి ఉంది. కానీ 20 రోజులగా ఆ రిసార్ట్స్ పేరుతో డిపోలో ఎలాంటి మద్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో అధికారులకు అనుమానం కలిగింది. దీంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమారేశ్వరన్ ఆదేశాల మేరకు ఏలూరు ఎక్సైజ్ ఎస్ఐ విశ్వేశ్వరరావు తన సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. అక్కడ తనిఖీలు నిర్వహించగా 323 మద్యం బాటిల్స్ (180 ఎంఎల్)ను గుర్తించారు. వాటిపై ఎలాంటి లేబుల్స్ లేవు. అంతేకాకుండా డ్యూటీపెయిడ్ మద్యం ఫుల్ బాటిల్స్ 40, బీరు బాటిల్స్ 48ని కూడా సీజ్ చేశారు. 323 క్వార్టర్ బాటిల్స్‌ను ఎక్కడ నుంచి ఎవరు తెచ్చారు, ఎలా వచ్చాయనే దానిపై విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న ఇద్దరు వ్యక్తులు పోణంగినకు చెందిన పూడి ఫణీంద్రకుమార్, మడిచర్ల రాజేష్‌ను అరెస్టు చేశారు. కేసు విచారణ చేపట్టారు. ఏపీ టూరిజం కార్పొరేషన్‌కు చెందిన ఈ రిసార్ట్స్‌కు అక్రమంగా మద్యం బాటిల్స్ ఎలా వచ్చాయనేదానిపై అధికారులు విచారణ చేపట్టారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

కమల కిరీటం

(1వ పేజీ తరువాయి)

యూపీఏ ప్రభుత్వంలో బొగ్గు, గనుల శాఖ మంత్రిగా పని చేశారు. నరసాపురం నుంచి ఎంపీగా ఎన్నికైన యూవీ కృష్ణంరాజు కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రిగా జిల్లా నుంచి సేవలందించారు. ఏలూరు నుంచి ఎంపీగా ఎన్నికైన కావూరి సాంబశివరావు జౌళి శాఖ మంత్రిగా వ్యవహరించారు. అలాగే చిరంజీవి సైతం రాజ్యసభకు ఎంపికై కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా సేవలందించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఇలా అతికొద్ది మందికి మాత్రమే కేంద్ర మంత్రి మండలిలో సేవలందించారు. తాజాగా భూపతి రాజు శ్రీనివాస్‌వర్మ కేంద్ర మంత్రి మండలిలో చోటు దక్కించుకున్నారు. జిల్లా నుంచి కేంద్ర మంత్రులుగా వ్యవహరించిన వారంతా జిల్లా అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించారు. తాజాగా వర్మకు ఆ అవకాశం లభించింది. భారతీయ జనతా పార్టీకి విధేయునిగా ఉన్న ఆయన రాష్ట్ర అభివృద్ధిలో కీలకమయ్యే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి వర్గంలో వర్మకు చోటు లభించడంతో జిల్లాలో పార్టీ కేడర్ సంబరాలు చేసుకుంటున్నారు.

భీమవరానికి తొలి కేంద్ర మంత్రి పదవి

(1వ పేజీ తరువాయి)

స్వాతంత్ర్య సమరయోధుడు. 1967లో భూపతిరాజు సూర్యనారాయణరాజు, సీత దంపతులకు భీమవరంలో జన్మించారు. హైస్కూల్ స్థాయిలోనే విద్యార్థి సమస్యలపై ప్రశ్నించే నాయకత్వ లక్షణాలు వంట పట్టించుకున్నారు. ఇంటర్, డిగ్రీలో కూడా విద్యార్థి సమస్యలపై వామపక్ష విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్‌కు నాయకత్వం వహించారు. పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన 1990లో భారతీయ జనతా పార్టీలో చేరారు. 34 సంవత్సరాల పాటు బీజేపీలో ఆయన చేసిన రాజకీయ సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించింది.

రాజకీయ ప్రస్థానం ఇలా..

1990 నుంచి బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న శ్రీనివాసవర్మ పార్టీలో వివిధ పదవులు చేపట్టారు. 1991 నుంచి 96 వరకు బీజేపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా 1996 నుంచి 99 వరకు జిల్లా కార్యదర్శిగా చేశారు. 1999-2000 మధ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా, 2002-05 మధ్యలో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా, 2005-07 వరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2007-10 వరకు నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్‌గా వ్యవహరించారు. 2010-19 వరకు జిల్లా అధ్యక్షుడిగా, 2019-20 మధ్య జోనల్ ఇన్‌చార్జీగా పలు పదవులు నిర్వహించారు. 2015-19 మధ్య భీమవరం మున్సిపల్ కౌన్సిల్ పాలక వర్గంలో కౌన్సిలర్‌గా, ప్యానల్ కమిటీ ఛైర్మన్‌గా పదవి చేపట్టారు. పార్లమెంట్ కన్వీనర్‌గా ఉన్న సమయంలో 2009లో పార్లమెంట్‌కు బీజేపీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2020లో సెప్టెంబరులో రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.

ముమ్మరంగా పంట బోదెల తవ్వకాలు

మొగల్తూరు, జూన్ 9 : మండలంలోని ఉపాధి హామీ పథకంలో పంట బోదెతవ్వకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు అందుబాటులో ఉంటున్నారు. దీంతో నిత్యం మండలంలోని పలు గ్రామాల్లో మంచినీటి చెరువులు, పంట పొలాలకు నీరందించే బోదెలు తవ్వుతున్నారు. ఆదివారం మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెంలో పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. ఈ పనులు పరిశీలించిన టిఎ వెంకటేశ్వరరావు మస్తర్లు వేసి కూలీలకు పలు సూచనలు చేశారు.

వర్మపై దాడి.. పవన్ సీరియస్..!



- వన్నెపూడి ఘటనపై విచారణకు ఆదేశం
- కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌కు బాధ్యతలు
- వారం రోజుల్లో పిఠాపురానికి జనసేనాని
- నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు
- జనసైనికులు సంయమనం పాటించాలి: నాగబాబు

అమరావతి (ఆంధ్రజ్యోతి), పిఠాపురం, జూన్ 9: పిఠాపురంలో జనసేన గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన మాజీ ఎమ్మెల్యే వర్మపై కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జరిగిన దాడిని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ సంఘటన వెనుక ఎవరున్నారు..? అనే దానిపై వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీనిపై విచారణ జరిపే బాధ్యతలను పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ అప్పగించారు. ప్రస్తుతం ఆయన నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి ఆదివారం ఢిల్లీ వెళ్లారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఈ నెల 12న జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బిజీబిజీగా ఉంటారు. అనంతరం ఆయన పిఠాపురం వెళ్లి అక్కడ పరిస్థితిని చక్కదిద్దనున్నారు. ఈ లోగా సంఘటనకు కారణాలు, ఇతర అంశాలపై పార్టీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నివేదిక సిద్ధం చేయాని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగానే పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఈ ఘటనలో పాలొన్నట్టు తెలిస్తే మాత్రం వారిపై తీవ్ర చర్యలు ఉంటాయన్న హెచ్చరికలు పంపించారు. తప్పు చేసిన ఎంతటి వారైనా ఉపేక్షించది లేదని పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఇప్పటికే హెచ్చరించారు. అధినేత పవన్ కల్యాణ్ వచ్చిన తర్వాత ఘటనపై తుదినిర్ణయం తీసుకోనున్నారు.

ఘటనపై వివరాలు సేకరిస్తున్నాం: నాగబాబు

వన్నెపూడిలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మపై జరిగిన దాడి, తదనంతర పరిణామాలు పార్టీ దృష్టికి వచ్చాయని, దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఆదివారం తెలిపారు. పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఇందులో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పుచేసిన వారిని ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తాటిపర్తి గ్రామంలో జరిగిన సంఘటన గురించి తమకు సమాచారం ఉందని, పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ నేతృత్వంలో స్థానిక నేతలతో చర్చించి దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. జనసైనికులందరూ సంయమనం పాటించాలని కోరారు. సాధ్యమైనంత వరకూ తాను కూడా నియోజకవర్గంలోనే అందుబాటులో ఉంటానని, సమస్యలు ఏమైనా ఉంటే కూర్చొని పరిష్కరించుకుందామని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మారు

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మి ఓటు వేశారని, దీనిపై చర్చ ఎందుకని అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఓడిపోవడంపై స్పందిస్తూ 'ఇది ప్రజాతీర్పు అన్నారు. ఆ తీర్పుకు శిరసా వహించాల్సిందే. సీన్ ఈజ్ ఓవర్' అన్నారు. 40 శాతం ఓట్లు వచ్చాయని ఇప్పటికే జగన్మోహన్‌రెడ్డి తెలిపారని, అక్కడినుంచి నిలబడి వడివడిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతామని చెప్పారు. ఇదే తమ ప్రధాన అజెండా అని చెప్పారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి గిరిజనులంతా తరలిరావాలి: ధారునాయక్

అమరావతి,జూన్9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడి ప్రమాణస్వీకార కార్యక్రమానికి గిరిజనులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఘనవిజయం సాధించిన కూటమి తరఫున ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించే దినంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. 16గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ సర్కార్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేసి, రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపిన గిరిజనులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో గిరిజనులు ఎదుర్కొన్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

వీసీలు స్వచ్ఛందంగా తప్పుకోవాలి: ఏఎస్ రామకృష్ణ

అమరావతి,జూన్9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన విశ్వవిద్యాలయాల ఉపకులపతులందరూ వెంటనే రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం బలవంతంగా తొలగించక ముందే స్వచ్ఛందంగా తప్పు కోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన చేస్తూ, ముఖ్యంగా ఆంధ్రావర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి, నాగార్జున వర్సిటీ వీసీ రాజశేఖర్ వైసీపీ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొన్నారు. వర్సిటీల్లో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంపై దృష్టి పెట్టకుండా, వర్సిటీలను వైసీపీ కార్యాలయాలుగా మార్చారు. అత్యుత్సాహంతో వర్సిటీల్లో వైఎస్సార్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ఘన విజయంతో అధికారం చేపడుతున్నా, ఇంకా ఏ ముఖం పెట్టుకుని, వీసీ పదవుల్లో కొనసాగుతారని మండిపడ్డారు.

బాబు పాలనలో ఏపీ అభివృద్ధి చెందాలి

- కాబోయే సీఎంకు నవీన్ పట్నాయక్ అభినందనలు

భువనేశ్వర్, జూన్ 9: టీడీపీ అధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కాలని బీజేడీ చీఫ్, ఒడిసా ఆపద్ధర్మ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించినందుకు చంద్రబాబును అభినందించారు. చంద్రబాబుతో మాట్లాడి అభినందనలు తెలియజేశానని ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. తన రాజకీయ జీవితంలో చంద్రబాబుతో సుదీర్ఘ అనుబంధం ఉందని నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. ఏపీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించగా, వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే.

హైవేపై ఒరిగిన విద్యుత్ స్తంభాలు

- బెంబేలెత్తిన వాహనదారులు.. కాంట్రాక్టర్ కక్కుర్తే కారణం
- కత్తిపూడి- ఒంగోలు హైవేపై తప్పిన పెను ప్రమాదం



గుడివాడ, జూన్ 9: కాంట్రాక్టర్ కక్కుర్తి ఫలితంగా ఏకంగా జాతీయ రహదారి పైనే విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారిపై ఒక్కసారిగా స్తంభాలు వంగిపోవడంతో వాహనదారులు బెంబేలెత్తిపోయారు. గుడివాడ మండలం రామనపూడి గ్రామం వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం సుమారు 11.30 గంటలకు ఒక్కొక్కటిగా 7 స్తంభాలు నెలకొరిగాయి. అయితే ఆ సమయంలో వాహనాలేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒరిగిన స్తంభాలు దాదాపుగా రహదారికి సగానికి పైగా ఆక్రమించడంతో ప్రమాదకరంగా మారాయి. కాగా, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. విద్యుత్ అధికారులు తీరిగ్గా సాయంత్రం 5 గంటలకు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి వైర్లను కత్తించారు. స్తంభాలను యథావిధిగా వదిలేశారు. కనీసం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయలేదు. దాదాపు ఐదున్నర గంటలపాటు ప్రజలు ఆ ప్రాంతంలో బిక్కు బిక్కు మంటూ గడిపారు. ఇక, ఈ స్తంభాలను వైసీపీ ప్రభుత్వం హయాంలో కాంట్రాక్టర్ నాసి రకంగా వేశారు. స్తంభాలు నిలబెట్టే క్రమంలో సరైన ఫౌండేషన్ వేయలేదు. కక్కుర్తిగా పనులు చేపట్టడంతో అవి ఒరిగిపోయాయి. కాంట్రాక్టర్ వైసీపీ ముఖ్య అనుచరుడు కావడంతో అధికారులు నోరుమెదపలేక పోయారన్న ప్రచారం సాగుతోంది.



గేట్లకు రోప్ లేకుండా ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు



అసంపూర్తిగా జీడీపీ ఆనకట్ట బలోపేతం పనులు

'గాజులదిన్నె'కు గండం!

- గేట్లు పెట్టారు.. రోప్ కనెక్షన్లు మరిచారు
- వరద పోటెత్తితే గేట్లు తెరిచే అవకాశమే లేదు
- 30 కోట్ల బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టరు
- జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ముప్పు
- మరో 'అన్నమయ్య డ్యాం' కాకముందే స్పందించాలి
- సాగునీటి నిపుణులు, రైతుల వినతులు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల మనుగడ ప్రమాదంలో పడింది. జగన్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం కారణంగా ఇప్పటికే కడప జిల్లాలో అన్నమయ్య డ్యాం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అక్కడ ప్రాజెక్టు ఉందనే ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో గాజులదిన్నె జలాశయానికీ అలాంటి ముప్పే పొంచి ఉంది. ప్రాజెక్టు ఆధునీకరణ, మరమ్మతుల్లో భాగంగా కొత్త గేట్లు బిగించారు. అయితే వాటి నిర్వహణకు వీలుగా రోప్స్, లైనాప్ ప్లేట్లు వంటివి ఏర్పాటు చేయలేదు. డ్యాం ఎగువన వర్షాలు పడుతున్నాయి. వరద పోటెత్తితే గేట్లు ఎత్తే అవకాశం లేకపోవడంతో ప్రాజెక్టుకు ప్రమాదం తప్పదని సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు జగన్ ప్రభుత్వంలో రూ.30 కోట్లు బిల్లులు చెల్లించకపోవడంతో ఆరు నెలలు క్రితమే కాంట్రాక్టరు చేతులెత్తేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించకపోతే గాజులదిన్నె కూడా అన్నమయ్య ప్రాజెక్టు తరహాలో ఆనవాళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయలసీమ జిల్లాల్లోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో కర్నూలు జిల్లా గాజులదిన్నె (దామోదరం సంజీవయ్య సాగర్) ప్రాజెక్టు ఒకటి. కర్నూలు జిల్లా గోనేగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ, డోన్ మండలాల్లోని పలు గ్రామాల్లో రబీ పంటలకు 24,372 ఎకరాలకు సాగునీరు, కర్నూలు నగరం, కృష్ణగిరి, డోన్ పట్టణాలతో పాటుగా 125 గ్రామాలకు తాగునీరు ఈ ప్రాజెక్టు ద్వారానే అందుతోంది. బండగట్టు రక్షిత మంచినీటి పథకం ద్వారా పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 80 గ్రామాలకు పైగా తాగునీరు అందించాల్సి ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు తాగునీటి అవసరాల కోసం హంద్రీనీవా కాలువ నుంచి 3 టీఎంసీల నీటిని కేటాయించారు. దీంతో జలాశయం సామర్థ్యం 7.5 టీఎంసీలకు పెంచాలనే లక్ష్యంగా రూ.108 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ తర్వాత జగన్ ముఖ్యమంత్రిగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సవరించి 5.5 టీఎంసీల సామర్థ్యానికి పెంచుతూ రూ.37 కోట్లతో ఆనకట్ట బలోపేతం, ఎత్తు పెంచడం వంటి పనులు చేపట్టారు. మరో రూ.12కోట్లతో కొత్త గేట్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ పనులను బీఎన్‌వీ కన్‌స్ట్రక్షన్, శ్రీశ్రీ విఙ్ఞేశ్వర కన్‌స్ట్రక్షన్ సంస్థలు దక్కించుకోగా.. విజయవాడకు చెందిన కాంట్రాక్టరు కోటిరెడ్డి సబ్ కాంట్రాక్టు తీసుకుని 2022 ఏప్రిల్ 26న పనులు చేపట్టారు.

భారీ వరదొస్తే తిప్పలే

గాజులదిన్నె ప్రాజెక్టు ఆరు గేట్ల డిశ్చార్జ్ కెపాసిటీ (వరద విడుదల సామర్థ్యం) 80 వేల క్యూసెక్కులు. ఈ గేట్లకు దశాబ్దాలుగా మరమ్మతులు చేయకపోవడంతో తుప్పుపట్టాయి. నిర్వహణ కష్టంగా మారింది. కొత్త గేట్ల ఏర్పాటులో భాగంగా 2023 సెప్టెంబరులోనే ఫ్యాబ్రికేషన్ (తయారీ), ఎరక్షన్ (పాతవాటి స్థానంలో కొత్త గేట్లు అమర్చడం) వంటి పనులు పూర్తి చేశారు. వాటిని కిందకు, పైకి ఎత్తేందుకు(లిఫ్ట్) వీలుగా రోప్ కనెక్షన్లు, లైనాప్‌ప్లేట్స్ వంటి కీలకమైన పనులు చేయాల్సి ఉంది. చిన్న పనులే అయినా గేట్ల నిర్వహణలో ఇవే కీలకం. ఆనకట్ట బలోపేతం, గేట్ల ఏర్పాటు పనులకు దాదాపు రూ.30 కోట్ల మేర బిల్లుల చెల్లింపునకు జగన్ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు చేయలేనంటూ కాంట్రాక్టరు చేతులెత్తేశారు. ఖరీఫ్ సీజన్ మొదలైంది. రుతుపవనాలు ఆశాజనకంగా ఉండటంతో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నారు. కర్నూలు జిల్లాలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 77.7 మి.మీ. కాగా ఆదివారం (9వ తేదీ) నాటికే 97.9 మి.మీ. కురిసింది. 3శాతం అధిక వర్షపాతం నమోదైంది. జలాశయం ఎగువన పత్తికొండ మండలంలో 89.9 మి.మీ.కు గానూ 154.6 మి.మీ. (72% అధికం), ఆలూరు ప్రాంతంలో 77.5 మి.మీ.కు గానూ 108.2 మి.మీ.(40% అధికం), మద్దికెర మండలంలో 70.2 మి.మీ.కు గానూ 77.4 మిల్లీమీటర్లు (10% అధికం) వర్షం పడింది. రాయలసీమలో భారీ వర్షాలు కురిసే ఆకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అదే జరిగితే డ్యాంకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఎఫ్ఆర్ఎల్ లెవల్ దాటి వరద పోటెత్తితే గేట్లు ఎత్తాల్సి వస్తుంది. కొత్తగేట్లకు రోప్స్, లైనాప్ ప్లేట్ల పనులు చేయకపోవడంతో ఆనకట్టకు గండి కొట్టకపోతే కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు. కడప జిల్లాలో 2022 నవంబరులో అధిక వరద అన్నమయ్య ప్రాజెక్టుకు పోటెత్తడంతో ఒక గేటు రోప్ తెగిపోయి అడ్డంగా ఇరుక్కుపోవడంతో పైకి ఎత్తలేని పరిస్థితి. సామర్థ్యానికి మించి వరద రావడంతో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో 40 మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు పలు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. అలాంటి పరిస్థితులు రాకముందే గాజులదిన్నె ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు పూర్తిచేసి నిర్వహణకు అనుకూలంగా రోప్స్, లైనాప్ ప్లేట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



ప్రాజెక్టుకు కొత్తగా ఏర్పాటు చేసిన గేట్లు

తక్షణమే మరమ్మతులు చేపడతాం

గాజులదిన్నె ప్రాజెక్టుకు కొత్త గేట్లు ఏర్పాటు చేశాం. రోప్స్, లైనాప్ ప్లేట్లు ఏర్పాటు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. భారీ వరదలు వస్తే ఆనకట్టకు ప్రమాదం ఉన్న మాట నిజమే. కాంట్రాక్టరుపై ఒత్తిడి తెచ్చి తక్షణమే మిగిలిన పనులు చేయిస్తాం. ప్రాజెక్టుకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

- కబీర్‌బాషా, సీఈ, ఇరిగేషన్ ప్రాజెక్టులు, కర్నూలు



వైసీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తి 99 కోట్లు

- అసెంబ్లీలో 79% మంది నేరచరితులే
- 138 మందిపై క్రిమినల్ కేసులు: ఏడీఆర్

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తాజాగా ఏపీ అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యేలలో 138 (79%) మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వీరిలో 98 మందిపై సీరియస్ క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మొత్తం ఎమ్మెల్యేల్లో 162 మంది సంపన్నులు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 174 మంది అఫిడవిట్లను విశ్లేషించిన ఏడీఆర్ శనివారం ఓ నివేదిక విడుదల చేసింది. టీడీపీ తరఫున పుట్టపర్తి ఎమ్మెల్యేగా గెలిచిన పల్లె సింధూర రెడ్డి అఫిడవిట్‌ను విశ్లేషించలేదు. 2019లో ఎమ్మెల్యేలుగా గెలిచినవారిలో 96 (55%) మందిపై క్రిమినల్ కేసులుండగా ఈసారి వారి సంఖ్య మరింత పెరిగింది. ముగ్గురిపై హత్య, 32మందిపై హత్యయత్నం కేసులు నమోదయ్యాయని నివేదిక పేర్కొంది. 22మందిపై మహిళలపై దాడులకు పాల్పడిన కేసులు ఉండగా, ఒక ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు నమోదైంది. పార్టీలవారీగా చూస్తే టీడీపీ తరఫున గెలిచిన 134మంది ఎమ్మెల్యేలలో 115 మంది, బీజేపీ టికెట్‌పై గెలిచిన 8 మంది, జనసేన తరఫున విజయం దక్కించుకున్న 10 మంది, వైసీపీ తరఫున గెలిచిన ఆరుగురిపై క్రిమినల్ కేసులున్నాయి. సీరియస్ క్రిమినల్ కేసులు నమోదైన వారిలో టీడీపీలో 82మంది, బీజేపీలో ఐదుగురు, జనసేనలో ఏడుగురు, వైసీపీలో నలుగురు ఉన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేల ఆస్తులే ఎక్కువ

గత అసెంబ్లీ ఎన్నికలలో 163 మంది కోటీశ్వరులు గెలవగా ఈసారి 162మంది గెలిచారు. టీడీపీలో 127, జనసేనలో 18, వైసీపీలో 9, బీజేపీలో 8 మంది ఎమ్మెల్యేలు కోటీశ్వరులేనని ఏడీఆర్ తెలిపింది. ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ ఈసారి రూ.65.07 కోట్లు ఉండగా, గత అసెంబ్లీలో రూ.27.87 కోట్లుగా ఉంది. టీడీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.67.97 కోట్లు ఉండగా, వైసీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.99.19 కోట్లుగా ఉంది. బీజేపీ శాసనసభ్యుల సగటు ఆస్తుల విలువ రూ.34.29 కోట్లు, జనసేన ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.40.43 కోట్లుగా ఉంది.

- టీడీపీ అధినేత చంద్రబాబు రూ.931 కోట్ల ఆస్తితో అగ్రస్థానంలో ఉన్నారు. రెండోస్థానంలో నారాయణ రూ.824 కోట్లు, వైఎస్ జగన్ రూ.757 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు.
- మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎం. ఎస్ రాజుకు అందరికంటే అతి తక్కువగా రూ.12 లక్షల ఆస్తి ఉంది.
- రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే మిరియాల శిరీష రూ.19 లక్షలు, కర్నూల్ ఎమ్మెల్యే జయసూర్యకు రూ.21 లక్షల ఆస్తులున్నాయి.
- పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ కుటుంబ ఆదాయం దాదాపు రూ.73 కోట్లు ఉంది.
- విద్యార్హతల వారీగా చూస్తే.. 49 మంది ఎమ్మెల్యేలు 5 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు.
- 122 మంది డిగ్రీ ఆపై ఉన్నత విద్యావంతులు. ముగ్గురు డిప్లొమా చేశారు.
- వయసుల వారీగా చూస్తే.. 12 మంది 25-40 ఏళ్ల మధ్య, 118 మంది 41-60 ఏళ్ల మధ్య 43 మంది 61-80 ఏళ్ల మధ్య ఉన్నారు. ఒక ఎమ్మెల్యే వయసు 82 ఏళ్లు.

సీఐడీ ఆధీనంలో 'బేవరేజెస్'

- కార్పొరేషన్ కార్యాలయంలో సోదాలు
- ఫైళ్లు క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో మద్యం విక్రయాల్లో జరిగిన అవకతవలను నిగ్గుతేల్చేందుకు సీఐడీ దూకుడు పెంచింది. రెండు రోజులుగా విజయవాడ ప్రసాదంపాడులోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయంలో సోదాలు చేస్తోంది. బేవరేజెస్ ఎండీ కార్యాలయం మొత్తాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోపిడీయే లక్ష్యంగా ప్రభుత్వ షాపుల ద్వారా అమ్మకాలు సాగించి, కమీషన్లు కొల్లగొట్టిన వైనంపై విచారణ చేస్తోంది. ఇష్టానుసారం ధరలు పెంచేసి, కమీషన్ల రూపంలో వేల కోట్లు దండుకున్న వ్యవహారంలో ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. ఐదు అంతస్తులున్న భవనంలో మొదటి రెండు ఫ్లోర్లు ఎక్సైజ్ కార్యాలయంగా వాడుకుంటున్నారు. పై మూడంతస్తులు కార్పొరేషన్‌కు సంబంధించినవి. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు మాజీ ఎండీ వాసుదేవరెడ్డి కార్యాలయానికి వచ్చి ఫైళ్లు తీసుకెళ్లినట్లు ఫిర్యాదు అందడంతో ఈ నెల 7న హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సీఐడీ సోదాలు చేపట్టింది. అక్కడినుంచి వచ్చిన తర్వాత బేవరేజెస్ ఎండీ కార్యాలయాన్ని సీజ్ చేసింది. బయట పోలీసుల్ని కాపలా పెట్టి సీఐడీ అధికారులు లోపల సోదాలు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు సోదాలు కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జగన్ హయాంలో ఒక బాక్సు(కేసు) లిక్కర్‌పై రూ.250, బీరు కేసుపై రూ.150 చొప్పున వసూళ్లు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నారు. ఏడాదికి నాలుగు కోట్ల కేసులకు తగ్గకుండా ఐదేళ్లలో 20 కోట్ల కేసుల మద్యం విక్రయించి వేల కోట్లు దండుకున్న అక్రమార్కులను గుర్తించే పనిలో ఉన్నారు. కమీషన్ల రూపంలో దోచుకున్న వేల కోట్లలో జగన్‌కు వాటా వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఆ డబ్బు దాచి, అందులో కొంత ఎన్నికల్లో ఖర్చు చేశారని, మిగిలిన డబ్బంతా బెంగళూరుకు తరలించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమాలు ఇలా..

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 2019 అక్టోబరులో ప్రభుత్వ మద్యం షాపుల్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 3500 మద్యం షాపులను పూర్తిగా ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నారు. మద్యం షాపుల్లో ఏ బ్రాండ్లు అమ్మాలనేది ప్రభుత్వమే నిర్ణయించేది. లిక్కర్ కేసుపై రూ.250, బీరు కేసుపై రూ.150 కమీషన్‌గా ఇవ్వాలని మద్యం కంపెనీలకు వైసీపీ పెద్దలతో ప్రతిపాదన పెట్టించింది. ఇందుకు కంపెనీలు అంగీకరించలేదు. దీంతో... 'మీకు నష్టం జరగకుండా మద్యం ధర పెంచుతాం. ఆ పెంచిన ధరను తిరిగి కమీషన్ రూపంలో ఇవ్వండి' అనే విధానం తెచ్చారు. అందుకు కొన్ని కంపెనీలు అంగీకరించాయి. ప్రముఖ బ్రాండ్ల ఎంఎన్‌సీ కంపెనీలు మాత్రం ఒప్పుకోలేదు. దీంతో ఆయా కంపెనీల బ్రాండ్లను షాపుల్లో విక్రయించడం ఆపేశారు. 2020 జనవరి నుంచి వైసీపీ ప్రభుత్వ మద్యం షాపుల్లో జగనన్న బ్రాండ్లను విక్రయించింది. అలా అమ్మిన ప్రతి లిక్కర్ కేసు నుంచి వైసీపీ పెద్దలకు ముడుపులు అందాయి. గత ఐదేళ్లలో అమ్ముడైన లిక్కర్‌పై రూ.3600 కోట్లు, బీరుపై రూ.900 కోట్లు ప్రభుత్వం నుంచి కంపెనీలకు వెళ్లి, వైసీపీ నేతలకు చేరాయి. మొదట ఈ నగదు వసూలు వ్యవహారాన్ని హైదరాబాద్ కేంద్రంగా నడిపారు. కంపెనీలకు బిల్లులు చెల్లించిన వెంటనే వెళ్లి హైదరాబాద్‌లో కమీషన్లు ఇచ్చేవారు. ఈ క్రమంలోనే జగన్‌కు సన్నిహితంగా ఉండే ఓ ఫార్మా కంపెనీకి రూ.300కోట్లు ఇచ్చారు. ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగి మొత్తం సీజ్ చేయడంతో దుకాణాన్ని బెంగళూరుకు మార్చారని కంపెనీల ప్రతినిధులు అంటున్నారు. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీ నడిపే వైసీపీ పెద్దల సన్నిహితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఈ వసూళ్లకు కేంద్రంగా వ్యవహరించారు. ఆ తర్వాత అనేక మంది వచ్చారు. సీఐడీ వీరందరికీ నోటీసులు పంపి విచారించే అవకాశం ఉంది. మద్యం బాటిళ్ల కేసులపై కమీషన్లు, ఇటు కార్పొరేషన్‌లో వసూళ్లు కలిపి మొత్తంగా 5 వేల కోట్లకు పైగానే దోపిడీ చేసినట్లు తెలుస్తోంది.

రెండు రాష్ట్రాల్లో ఎంత తేడా...

మేన్షన్ హౌస్ బ్రాందీ 180మి.లీ. క్వార్టర్ బాటిల్ కేసు (48 సీసాలు) ఏపీ బేవరేజెస్ కంపెనీల నుంచి రూ.1697కు కొనుగోలు చేసింది. తెలంగాణ ప్రభుత్వం దాన్ని రూ.1094కు తీసుకుంది. అంటే ఓ కేసు ధరలో వ్యత్యాసం రూ.603. ఈ మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌కు అనధికారికంగా చేరినట్టు ఆరోపణలు ఉన్నాయి. జగన్ ప్రభుత్వం మద్యం షాపుల్లో ఒక్కో క్వార్టర్ బాటిల్‌ను రూ.220కి విక్రయించగా, తెలంగాణలో రూ.170కే అమ్మారు. ఇలా పేదలకు అధిక ధరలకు మద్యం అంటగట్టి వేల కోట్లు వెనకేసుకున్నారు.

వాసుదేవరెడ్డి నుంచి సజ్జల దాకా..

జగన్ పాలనలో మద్యం దోపిడీ తతంగం నడిపించేందుకు ఎక్సైజ్, బేవరేజెస్ కార్పొరేషన్‌లో పలువురు కీలకంగా పనిచేశారు. కమీషన్లు ఇచ్చే కంపెనీలకు మాత్రమే ఎండీ వాసుదేవరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డర్లు వెళ్లేవి. తమకెందుకు ఇవ్వరని ఇతర ఉత్పత్తిదారులు ప్రశ్నిస్తే.. ఏదో మమ అనిపించేవారు. ఆ బ్రాండ్లను షాపుల్లో పెట్టి అమ్మకుండా, వాటిని ఎవరూ కొనట్లేదని వెనక్కి పంపేవారు. ఏ రోజు ఏ బ్రాండ్లు ఎక్కువ అమ్మాలన్నది సజ్జల రామకృష్ణారెడ్డి నిర్ణయించేవారు. ప్రతిరోజూ ఉదయం సజ్జల నుంచి బ్రాండ్ల చార్టు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్‌కు వెళ్లేది. ఆయన దాన్ని మద్యం డిపో మేనేజర్లు, షాపుల్లో సేల్స్‌మెన్‌కు పంపేవారు. దాని ప్రకారం మద్యం విక్రయించేవారు. మద్యం కంపెనీలకు బకాయిల విడుదల వ్యవహారాలను కార్పొరేషన్‌లో పదవీ విరమణ చేసిన వేణుగోపాల్ చూసేవారు. ప్రతి బిల్లులో 20శాతం కమీషన్ తీసుకుని బకాయిలు విడుదల చేసేవారు. మరో రిటైర్డ్ అధికారి శ్రీనివాసరెడ్డి 3నెలలుగా స్టాకు అమ్ముడుపోలేదనే కారణాన్ని చూపి ఎడాపెడా కంపెనీల నుంచి గ్రౌండింగ్ చార్జీలు వసూలు చేశారు.

బెట్టింగులే బలిగొన్నాయా?!

- అనుమానాస్పద స్థితిలో వైసీపీ నాయకుడి మృతి
- ఎన్నికల ఫలితాల రోజు నుంచి అజ్ఞాతంలోనే..

నూజివీడు టౌన్, జూన్ 9: ఏలూరు జిల్లా నూజివీడు మండలం తూర్పుదిగవల్లి వైసీపీ నాయకుడు జగ్గవరపు వేణుగోపాలరెడ్డి ఆదివారం అనుమానాస్పద స్థితిలో తన మామిడి తోటలోని షెడ్డు వద్ద మృతి చెందారు. తూర్పు దిగవల్లి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి భర్త అయిన వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీల గెలుపు, ఓటములపై పలు బెట్టింగ్‌లకు మధ్యవర్తిగా వ్యవహరించినట్టు సమాచారం. దాంతో పాటు తాను సైతం భారీగా బెట్టింగులు కాసి డబ్బు కోల్పోయినట్టు చెప్పుకొంటున్నారు. దాదాపు 30 కోట్ల రూపాయల వరకు ఎన్నికల బెట్టింగుల్లో మధ్యవర్తిగా లేదా ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల రోజు నుంచి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు కనిపించలేదు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం పలువురు పందెం రాయుళ్లు వేణుగోపాల్‌రెడ్డి ఇంటిపై దాడి చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున అతడు తన మామిడి తోటలోని షెడ్డు వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి నూజివీడు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి శరీరంపై గాయాలు ఉండడంతో గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు నూజివీడు రూరల్ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.



వేణుగోపాల్‌రెడ్డి



జిమ్‌కు తిరిగి ఎన్టీఆర్ పేరు ఏర్పాటు చేసిన బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్, సాయి తదితరులు

మళ్లీ 'ఎన్టీఆర్ జిమ్'గా..

- గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో వైసీపీ శిలాఫలకాల ధ్వంసం
- వందలాదిగా పాల్గొన్న వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు
- 'ఎన్టీఆర్'ని టచ్ చేస్తే తీవ్ర పరిణామాలు: బ్రాహ్మణ చైతన్య వేదిక

గుంటూరు, జూన్ 9: గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ జిమ్ పేర్లను మార్చేందుకు గత వైసీపీ పాలకులు చేసిన కుట్రలను బ్రాహ్మణ చైతన్య వేదిక భగ్నం చేసింది. ఆ మేరకు స్టేడియంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను బ్రాహ్మణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం ధ్వంసం చేశారు. స్టేడియంలోని జిమ్ నూతన భవనంపై 'ఎన్టీఆర్ జిమ్' అంటూ భారీ అక్షరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ మాట్లాడుతూ ఎవరైనా అన్న ఎన్టీఆర్ పేరును టచ్ చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఎన్టీఆర్ స్టేడియంను వైఎస్సార్ స్టేడియంగా పేరు మార్చేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులతో అధికారులు కుట్రపన్నారన్నారు. అందుకోసమే స్టేడియంలో నూతన భవన నిర్మాణం చేపట్టి వైఎస్సార్ జిమ్‌గా పేరు పెట్టేందుకు శిలాఫలకం ఏర్పాటు చేశారని మండిపడ్డారు. దీనిపై తాము హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశామని, అయినా.. మున్సిపల్ అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై నిర్మాణ పనులు ఆపకుండా అక్రమంగా కొనసాగించారని విమర్శించారు. హైకోర్టులో పిల్ పెండింగ్‌లో ఉన్నా, ఎన్నికల కోడ్ ఉన్నా అప్పటి మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు వైఎస్సార్ పేరుతో శిలాఫలకాలు ప్రారంభించేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారన్నారు. దీనిపైనా తాను హైకోర్టులో మరో పిల్ వేయగా వైసీపీ ప్రజా ప్రతినిధులు బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. భవన నిర్మాణానికి మున్సిపల్ కార్పొరేషన్ నిధులు రూ.49 లక్షలు కేటాయించినట్లుగా చూపి ప్రజాధనాన్ని నొక్కేశారని, నూతన ప్రభుత్వం తక్షణమే ఆడిట్ జరిపించి ఆ డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ, వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు వందలాదిగా పాల్గొన్నారు.

బలమైన ప్రతిపక్షంతోనే ఆరోగ్యకర ప్రజాస్వామ్యం!

- వచ్చే ఐదేళ్లు కేంద్రంలో మంచి పాలన: రజినీకాంత్
- చంద్రబాబు ఆహ్వానిస్తే ప్రమాణస్వీకారానికి వెళతానని వెల్లడి



చెన్నై, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బలమైన ప్రతిపక్షాన్ని ప్రజలు ఎన్నుకొన్నారని, ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతమని తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం ఢిల్లీకి బయలుదేరిన ఆయన చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఐదేళ్లు కేంద్రంలో ఎలాంటి పాలన ఉంటుందని భావిస్తున్నారని విలేకరులు ప్రశ్నించగా, మంచి పాలన ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికైన ఘనతను మోదీ సాధించారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమానికి తనను ఆహ్వానిస్తే తప్పకుండా హాజరవుతానని రజినీకాంత్ తెలిపారు.

నవ్య
కుటుంబ కదంబం



పెళ్లి తరువాత చాలామంది మహిళలు ఇళ్లకే పరిమితమై పోతారు. జ్యోతి శ్రీవాస్తవ పరిస్థితీ అదే. ఇంజనీరింగ్ చదివి... రాకెట్లు డిజైన్ చేసిన ఆమె కెరీర్... వివాహం అయ్యాక అమాంతం ఆగిపోయింది. కానీ బిడ్డ పుట్టాక... ఆమె ఆలోచనే మారిపోయింది. ఒక తల్లిగా గడించిన అనుభవాన్ని... ఫుడ్ బ్రాండ్‌గా మార్చి... పారిశ్రామికవేత్తగా సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. నేడు ఎందరో తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆ తల్లులకు వందనం

"అశోక విశ్వవిద్యాలయం ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం... 73 శాతం మంది భారతీయ మహిళలు మొదటి బిడ్డ పుట్టాక ఉద్యోగం వదిలేస్తున్నారట. ఆ నివేదిక చదివాక ఆశ్చర్యం అనిపించింది. ఇల్లు, పిల్లలు, బాధ్యతలంటూ ఆడవారు తమ కెరీర్ గురించి ఆలోచించడంలేదు. వెనక్కి తిరిగి చూసుకొంటే... నా పరిస్థితీ అదే. మా స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్. కెమికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశాను. వెంటనే ఉద్యోగం వచ్చింది. వృత్తిలో భాగంగా భారత సైన్యం కోసం రాకెట్లు డిజైనింగ్ చేశాను. అది నాకు ఎంతో ఇష్టమైన కొలువు. దాని కోసం నానోటెక్నాలజీ, రాకెట్ ప్రొపెల్లెంట్స్‌లో స్పెషలైజేషన్ చేశాను. అయితే అక్కడ విపరీతమైన పని. క్షణం తీరిక దొరికేది కాదు. జీతం మాత్రం చాలా తక్కువ. పనికి... జీతానికి పొంతన లేదు. దాంతో రెండున్నరేళ్ల తరువాత, అంటే 2018లో ఉద్యోగం వదిలేశాను. అనంతరం ఫ్రీలాన్సర్‌గా కొన్ని వాయుసేన ప్రాజెక్ట్‌కు పని చేశాను. ఎందుకో అది కూడా నాకు సంతృప్తినివ్వలేదు. అదే సమయంలో నాకు పెళ్లయింది. కొన్నాళ్లు ప్రాజెక్ట్ కొనసాగించాను.

అనుభవం నుంచి...

ఏడాది తరువాత నేను గర్భవతిని అయ్యాను. అప్పుడు మొదలయ్యాయి నా కష్టాలు. పుట్టబోయే బిడ్డ కోసమే కాదు... నా గురించి కూడా నేను శ్రద్ధ తీసుకోవాలి కదా. అందుకే ప్రాజెక్ట్ అన్నీ పక్కన పెట్టేశాను. బాబు పుట్టాడు. తల్లి పాలు పట్టే విషయంలో సమస్యలు ఎదురయ్యాయి. ఆ తరువాత వాడికి అందించే ఆహారం విషయంలోనూ అయోమయం. ఒక తల్లిగా పిల్లాడికి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలనేది నా తపన. చిరుధాన్యాల్లో అయితే పోషకాలు పుష్కలంగా ఉంటాయని, కొన్ని రోగాలను నయం చేసే శక్తి కూడా వాటిల్లో ఉందని అర్థమైంది. తల్లి పాలలోని గుణాలు ఇందులోనూ ఉన్నాయి. మిల్లెట్స్ పిల్లల ఎదుగుదలను గణనీయంగా పెంచుతాయని పలు నివేదికలు పేర్కొన్నాయి. వీటన్నటి నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందనిపించింది.

ప్రత్యేక కోర్సులు చదివి...

బిడ్డ పోషణకు సంబంధించి పూర్తి అవగాహన కావాలి. అందు కోసం యునిసెఫ్ 'ఐవైసీఎఫ్' (ఇన్‌ఫ్యాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్) కోర్సు చదివాను. దాంతోపాటే 'చైల్డ్ అండ్ మెటర్నల్ న్యూట్రిషన్' సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాను. ఆ తరువాత నాలాంటి తల్లులకు పిల్లల ఆరోగ్యం, పోషకాహారం గురించి అవగాహన కల్పించేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లో 'లిటిల్ చెర్రీ మామ్' పేరుతో పేజీ ఒకటి తెరిచాను. కెమికల్ ఇంజనీరింగ్ చదివిన నాకు ఫుడ్ ప్రాసెసింగ్ మీద అవగాహన ఉంది. భారీ ప్రాజెక్టులకు పని చేసిన అనుభవం ఉంది. అందుకే ఎవరో తెలిసీ తెలియక అన్న మాటలు నేను పట్టించుకోలేదు. నేను అందించే సమాచారం కొందరు చంటి బిడ్డల తల్లులకైనా చేరితే చాలనుకున్నాను.

మా అబ్బాయి పేరుతో...

పసి పిల్లల ఎదుగుదలకు సంబంధించి ఆయుర్వేదంలో పేర్కొన్న వివిధ రకాల మూలికల గురించి కూడా చదివాను. వాటి ఔషధ గుణాలకు సంబంధించిన సమాచారం సేకరించి పెట్టుకున్నా. వీటన్నిటినీ క్రోడీకరించి, మిల్లెట్స్‌తో రోజుకు మూడు రకాల వంటలు ప్రయత్నించాను. పోషక విలువలే కాదు, రుచి కూడా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నా. ఎందుకంటే రుచికరంగా లేకపోతే పిల్లలు ముట్టుకోరు. అలా కొన్ని రెసిపీలు సిద్ధమయ్యాక మా అబ్బాయి పేరుతో చిరుధాన్యాల ఆధారిత 'లిటిల్ చెర్రీ ఫుడ్స్' కంపెనీ ప్రారంభించాను. చిన్నారులకు నాణ్యమైన, పోషక విలువలు ఉన్న, తాజా ఆహారం అందించాలనే లక్ష్యంతో దీన్ని నెలకొల్పాను.

> **ఆరంభంలో కొందరు నన్ను ఎగతాళి చేశారు. హేళనగా మాట్లాడారు. 'ఈమెకేం తెలుసు' అన్నట్టు కొందరు బంధువుల, స్నేహితులు నా మీద జోక్‌లు వేశారు. 'నాడు మంచి ఉద్యోగం వదిలి తప్పు చేశావు' అన్నారు. అవేవీ పట్టించుకోలేదు.**



సవాళ్లు ఎదురైనా...

ఒకానొక దశలో ఇక నా వృత్తిగత జీవితం ముగిసిపోయిందని అనుకున్నా. ఆ సమయంలోనే ఇన్‌స్టాలో నేను పెట్టిన పోస్ట్‌లకు క్రమంగా వీక్షకులు పెరిగారు. కొద్ది రోజుల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటింది. అది నాకు నూతనోత్తేజాన్ని ఇచ్చింది. ఆ ఉత్సాహంతోనే కంపెనీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చాను. అయితే దానికి డబ్బు ఎక్కడి నుంచి తేవాలి? అది పెద్ద సమస్యగా మారింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మావారు నాకు అండగా నిలిచారు. కొంతవరకు ఆర్థిక వనరులు సమకూర్చారు. మిగిలిన పెట్టుబడి కోసం నేను ఆన్‌లైన్‌లో వర్క్‌షాప్స్ నిర్వహించాను. కానీ ఇంకా లోటు. దాంతో బ్యాంకు లోను తీసుకొని వ్యాపారం మొదలుపెట్టాను. సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ ప్రాంతాల్లోని నవజాత శిశువుల తల్లులకు చేరువయ్యే ప్రయత్నం చేశాను. తొలి విడత ఉత్పత్తులు మార్కెట్‌లోకి విడుదల చేసే నాటికి మావద్ద యాభై వేల పైచిలుకు తల్లులతో కూడిన అతిపెద్ద సమూహం ఒకటి ఏర్పడింది. ఆ తరువాత నా పని సులువైంది. కష్టానికి ఫలితం దక్కింది. ఏడాది తిరక్కుండానే మా బేబీ ఫుడ్స్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు మా టర్నోవర్ కోటి రూపాయలు దాటింది. నేటికీ మిల్లెట్ ఫుడ్ మీద అవగాహన కల్పిస్తున్నాను. వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను. సంపాదన, సంతృప్తి... రెండూ దక్కుతున్నాయి. ఇదంతా అంతమంది తల్లులు నాపై ఉంచిన నమ్మకం. ఆ తల్లులందరికీ నా వందనం."

మార్పు యోధులు...

వారియర్స్ వితవుట్ ఎ కాజ్...

పేదలకు, అణగారిన వర్గాలకు ఏదైనా మేలు చేద్దామనే తపనతో నలుగురు కాలేజీ అమ్మాయిలు ఏర్పాటు చేసిన ఈ ఎన్జీవో.. ఇప్పుడు మూడువందల మందికి పైగా వాలంటీర్లతో... దేశంలోని వివిధ నగరాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్పందించే మనసుంటే... సాయం చెయ్యడానికి వయసుతో, ఆర్థిక స్థాయితో సంబంధం లేదని నిరూపిస్తోంది ఈ యువ బృందం.



2020... జన జీవనంలో కొవిడ్ మహమ్మారి రేపిన అల్లకల్లోలాన్ని చూసి చలించిపోయారు అనూష అత్రి, భవానీ సింగ్, ఖుషీ సింగ్, వంశికా మెహతా. ఆ నలుగురు అప్పుడే టీనేజీ దాటిన స్నేహితులు. ఢిల్లీలో చదువుకుంటున్నారు. కనీస అవసరాలు తీరక అల్లాడిపోతున్న ప్రజానీకానికి తమ వంతుగా ఏదైనా చెయ్యాలనుకున్నారు. తమ పాకెట్ మనీని పోగేసి... మాస్కులు, శానిటైజర్లు కొని... మురికివాడల ప్రజలకు పంచిపెట్టారు. ఆ తరువాత నిత్యావసరాలను కూడా అందించారు. ఈ క్రమంలో... ఆ ప్రజల అత్యవసరాలను ప్రత్యక్షంగా గమనించి, అర్థం చేసుకున్నారు. సామాజిక సంక్షేమం కోసం ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించి, రిజిస్టర్ చేశారు. అదే 'వారియర్స్ వితవుట్ ఎ కాజ్'. "ఒక మార్పు తేవడానికి మనం దోహద పడడం వెనుక ఎలాంటి కారణం ఉండవలసిన అవసరం లేదనేది మా ఉద్దేశం. తోటివారి కష్టాలకు స్పందించి, వారికి సాయం చేసే సున్నితత్వం సమాజంలో పెరగాలి. ఆ దిశగా చైతన్యాన్ని వ్యాప్తి చెయ్యాలని, దీర్ఘకాలంలో... పేద వర్గాలను వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేలా చెయ్యాలని అనుకున్నాం. మురికివాడల్లో మా ప్రయత్నాన్ని ప్రారంభించాం" అని వివరించారు ఆ ఫ్రెండ్స్. కేవలం ఏదో ఒక అంశానికే పరిమితం కాకుండా... వైద్య శిబిరాల ఏర్పాటు, ఎడ్యుకేషన్ వర్క్‌షాపుల నిర్వహణ, శానిటరీ ప్యాడ్స్ ఆహారం, దుస్తులు, స్టేషనరీ, పుస్తకాల్లాంటివాటి పంపిణీతో సహా... విస్తృతమైన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో...

"అవసరాలు తీర్చడం, ఆసరాగా నిలబడడం, విద్యకు, ఉపాధికి సహకారం అందించడం... ఇవీ మా ప్రాధాన్యాలు. అదే సమయంలో మౌలిక సదుపాయాలను, ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నాం. విద్యుత్, పారిశుధ్య సదుపాయాలను అందుబాటులోకి తేవడం కూడా దీనిలో భాగం. మొత్తంగా వారి జీవన నాణ్యతను పెంచడానికి దోహదం చేస్తున్నాం" అని వారు చెబుతున్నారు. మురికివాడల్లో పిల్లలకు పాఠాలు చెప్పడం, ఆర్థిక విషయాలపై అవగాహన కల్పించడంతోపాటు ఢిల్లీలోని సిఆర్ఆర్ఐ మురికివాడలో కుట్లు, అల్లికలు లాంటి విషయాల్లో దాదాపు ముప్ఫై మంది మహిళలకు ఈ ఎన్జీవో శిక్షణనిచ్చి.. ఉత్పత్తులు తయారు చేయిస్తోంది. వాటిని మార్కెట్లలో, ఎగ్జిబిషన్లలో విక్రయించి... ఆ మహిళలకు శాశ్వతమైన ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంది. వీధి వర్తకులకు, చిన్న బండ్ల మీద సరుకులు అమ్ముకొనేవారికి ఎండ తీవ్రత నుంచి ఊరట కలిగించడానికి... కిందటి ఏడాది ఈ ఫ్రెండ్స్ ప్రారంభించిన 'బీట్ ది హీట్' కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. దాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా... పెద్ద గొడుగులు, టోపీలు, శీతల పానీయాలు, నీరు పంపిణీ చేస్తున్నారు. "వివిధ ప్రాంతాల్లో యాభైవేల మందికి వాటిని అందజేశాం. ఈ ఏడాది ఇప్పటికే అయిదు వేలమందికి పైగా ప్రయోజనం పొందారు. మరెంతో మందికి మా సేవలు అందించాల్సి ఉంది. దీనిలో ప్రజలను కూడా భాగస్వాముల్ని చేస్తున్నాం" అని చెబుతున్న 'వారియర్స్' ద్వారా గత మూడేళ్ళలో వివిధ సాయాలు అందుకున్నవారి సంఖ్య నాలుగు లక్షలకి పైనే.

నవ్య | చిత్రజ్యోతి

ఈ పుట్టిన రోజు ఎంతో ప్రత్యేకం



వెండి తెరపై 'సమరసింహ'మైన బాలకృష్ణ విశ్వరూపం చూసి అభిమానులు ఏనాడో తరించి పోయారు. ఆ హోరులో బాక్సాఫీస్ వసూళ్ల పండగ చేసుకుంది. ఆ తాకిడికి రికార్డులు దాసోహం అయ్యాయి.. బాలయ్య చేతిలోని ఆయుధమే కాదు కంటి చూపు, మాట కూడా పదునే... అందుకే ఈ నట 'సింహా'నికి జనం నీరాజనాలు పట్టారు. రాజకీయాల్లోకి అడుగు పెడితే అక్కడ కూడా ఆయన్ని ఘనంగా ఆదరించారు. మూడో సారి కూడా ఆయన్ని శాసన సభ్యుడిగా గెలిపించి హ్యాట్రిక్ వీరునిగా నిలబెట్టారు. ఒక సినీ హీరో ఇలా వరుసగా మూడు సార్లు అసెంబ్లీకి ఎన్నిక కావడం చరిత్రలో ఇదే ప్రథమం. అంతకు ముందు ఎన్టీఆర్‌కు ఇటువంటి రికార్డ్ ఉన్నా ఆయన సినిమాల నుంచి రాజకీయ రంగంలోకి వెళ్లిన తర్వాత ఆ ఘనత సాధించారు. కానీ సినీ రంగంలో ఉంటూనే రాజకీయ రంగంలో కూడా రికార్డులు క్రియేట్ చేసిన ఏకైక హీరో బాలయ్యే. శాసన సభ్యుడిగా హ్యాట్రిక్ విజయం సాధించిన నేపథ్యంలో వస్తున్న పుట్టిన రోజు (జూన్ 10) కావడంతో ఈ రోజు చాలా ప్రత్యేకతను సంతరించుకుంది.



తండ్రి ఎన్టీఆర్ దర్శకత్వంలో 'తాతమ్మ కల' (1974) చిత్రంతో ప్రారంభమైన బాలకృష్ణ చలన చిత్ర యాత్ర ఇంకా నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. ఆయనతో నటన ప్రారంభించిన హీరోలు, తర్వాత వచ్చిన వారూ మధ్య మధ్యలో గ్యాప్ తీసుకున్నా బాలయ్య మాత్రం ఆగిపోలేదు, అలసిపోలేదు. ఈ ఐదు దశాబ్దాల నట జీవితంలో భారీ విజయాలే కాదు..కొన్ని అపజయాలు కూడా ఉన్నాయి.. అపజయానికి కుంగిపోలేదు. విజయానికి దగ్గర దారులు వెదుకుతూ రాజీ పడలేదు.

భారతీయ నట వారసుల్లో నందమూరి బాలకృష్ణ ప్రత్యేకత వేరు.. తన సమకాలిక హీరోలు సాంఘిక చిత్రాలకే పరిమితం కాగా పౌరాణిక, జానపద, చారిత్రక, సైన్స్ ఫిక్షన్ చిత్రాల్లో సైతం బాలకృష్ణ నటించి తండ్రి ఎన్టీఆర్‌కు తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారు.

తెలుగు భాష పట్ల బాలకృష్ణకు ఎంతో గౌరవం. స్వచ్ఛమైన ఉచ్చారణతో, తెలుగుతనం ఉట్టిపడే పదాలతో ఆయన డైలాగులు చెప్పే తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. అలాగే ఈ నందమూరి అందగాడు ముఖ కవళికల్లో, అనర్గళంగా సాగే మాటల్లో పౌరుషం శివమెత్తి నాట్యం చేస్తుంటుంది. అందుకే బాలయ్య డైలాగులు అంటే ఫ్యాన్స్ లో అంత క్రేజ్.. ఇక ఆయన కత్తి పట్టి రంగంలోకి దిగితే యాక్షన్ పంట పండినట్లే. తనకు ఉన్న ఇమేజ్‌కి భిన్నంగా నిజ జీవితంలో బాలకృష్ణ వ్యవహరిస్తుంటారు. నలుగురిలో మామూలుగా కనిపిస్తే హీరోగా తన ఇమేజ్ దెబ్బ తింటుందేమో అనే అభద్రత భావం బాలయ్యలో బొత్తిగా కనిపించదు. తన కారుని తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళడం ఆయనకి ఒక సరదా. అలాగే అందరితో జోవియల్‌గా మాట్లాడుతుంటారు.

క్రమశిక్షణ.. ముక్కుసూటి మనస్తత్వం

బాలకృష్ణ తండ్రిలాగే క్రమశిక్షణకు ప్రాణం ఇస్తారు. అలాగే ఆయన నిర్మొహమాటి. ముక్కుసూటి మనస్తత్వం కలవారు. నాన్చుడు వ్యవహారం ఆయనకి నచ్చదు. ఏ విషయమైనా వెంటనే తేల్చేయాల్సిందే. నటన అనేది ఒక ఉద్యోగంగా భావించకుండా ఓ కళగా ఆరాధించే వ్యక్తి కావడం వల్లే ఐదు దశాబ్దాల నుంచి విరామం లేకుండా పనిచేస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు.

రామోజీ సేవలు అజరామరం



అక్షర యోధుడు రామోజీరావు మృతికి నివాళిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆదివారం సంస్మరణ సభ నిర్వహించింది. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని రామోజీరావు సేవలు అజరామరమని కొనియాడారు. నిర్మాత కేఎస్ రామారావు, చదలవాడ శ్రీనివాసరావు, స్రవంతి రవికిషోర్, రచయిత పరుచూరి గోపాల కృష్ణ, విజయేంద్రప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్, సెక్రటరీ ప్రసన్నకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd.,Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Racharla Road, Alampuram, Tadepalligudem - 534 166, West Godavari District, Andhra Pradesh. Editor : **K. Srinivas**. Phone No: 08818 - 280013.RNI No:APTEL/2003/09832. Managing Director : **Vemuri Radhakrishna**. Founder : K.L.N. Prasad.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024

Tadepalligudem |Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తాడేపల్లిగూడెం సిటీ

12నే పాఠశాలల పునఃప్రారంభం : డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 9 : నిర్ణీత అకడమిక్ కేలండర్ ప్రకారం వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12నే పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని డీఈవో అబ్రహం స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 12న పదవీ ప్రమాణ స్వీకారం చేయనుండడం, అదే రోజున పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో బుధవారం కాకుండా గురువారం పాఠశాలలను ప్రారంభించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో ఓ ప్రచారం జరుగుతోంది. దీనిపై డీఈవో వివరణ ఇస్తూ 'సంప్రదాయం ప్రకారం ఏటా వేసవిసెలవుల అనంతరం జూన్ 12న నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండడం రివాజుగా వస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువు తీరనున్న దృష్ట్యా పాఠశాలలను ఈ నెల 12న కాకుండా ఒకరోజు ఆలస్యంగా అంటే 13న తెరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎటువంటి అధికారిక ఉత్తర్వులు అందలేదు..' అని తెలిపారు.



భీమవరం పార్టీ కార్యాలయంలో కూటమి అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న వర్మ సతీమణి

పశ్చిమకు కమల కిరీటం

భూపతిరాజు శ్రీనివాస వర్మకు కేంద్ర మంత్రి పదవి





(భీమవరం-ఆంధ్రజ్యోతి)

"నరసాపురం ఎంపీగా గెలిచిరా.. నీ సంగతి నేను చూసుకుంటా.." అని రాజమహేంద్రవరం ఎన్నికల సభలో ప్రధాని నరేంద్ర మోదీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు పెద్ద హామీనే ఇచ్చారు..ఇప్పుడది నిజం చేశారు. ఏకంగా కేంద్ర మంత్రి పదవే ఇచ్చారు. నరసాపురం ఎంపీగా శ్రీనివాసవర్మ భారీ మెజారిటీతో విజయం సాధించారు. ప్రధాని మోదీ అన్నట్టుగానే వర్మకు కేంద్ర మంత్రి వర్గంలో చోటు ఇచ్చారు. పార్టీకి విధేయునిగా

- ఆంధ్రప్రదేశ్ కోటాలో బీజేపీ తరఫున ఎంపిక
- సామాన్య కార్యకర్త నుంచి మంత్రి వరకు
- పార్టీకి అత్యంత విశ్వాసపాత్రుడు
- కేంద్ర నాయకులతో సన్నిహిత సంబంధాలు

ఉండడంతో వర్మకు అదృష్టం వరించింది. నరసాపురం లోక్‌సభ టిక్కెట్ సాధించినప్పటి నుంచి మంత్రి వరకు అన్నీ ఆయనకు సునాయాసంగానే లభించాయి. తన ప్రయత్నాలన్నీ ఫలించాయి.మూడు దశాబ్దాలకు పైగా వర్మకు భారతీయ జనతా పార్టీతో అనుబంధం ఉంది. భారతీయ జనతా పార్టీ యువజన మోర్చా అధ్యక్షుడిగా వర్మ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి బీజేపీలో ఉంటూ పార్టీకి వివిధ హోదాల్లో సేవలందించారు. భీమవరం పట్టణ అధ్యక్షుడిగా సేవలందించారు. జిల్లా అధ్యక్షుడిగా పదేళ్లపాటు పార్టీ కోసం కృషి చేశారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా నర్సాపురం ఎంపీ సీటును వర్మ దక్కించుకున్నారు. భారీ విజయం సాధించారు. కూటమి శ్రేణులంతా వర్మ విజయానికి అలుపెరగని పోరాటం చేశాయి. కేంద్రమంత్రిగా బీజేపీ తరఫున వివిధ పేర్లు వినిపించాయి. ముందునుంచి ఢిల్లీలో శ్రీనివాసవర్మ తన ప్రయత్నాలు సాగించారు. కేంద్ర పెద్దలతో సంప్రదింపులు చేశారు. మోదీ అభయం నెరవేరింది. వర్మ ప్రయత్నాలు ఫలించాయి. కేంద్ర మంత్రివర్గంలో చోటు లభిం చింది. పశ్చిమ గోదావరి జిల్లాకు అది వరం కానుంది. పెండింగ్ ప్రాజెక్టులన్నింటికీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి పూర్తి చేస్తామని ఎన్నికల్లో వర్మ హామీ ఇచ్చారు. మంత్రి వర్గంలో చోటు దక్కడంతో అవన్నీ ఇప్పుడు నెరవేరనున్నాయి.

రాజమహేంద్రవరం ఎన్నికల ప్రచార సభకు విచ్చేసిన నరేంద్రమోదీ వేదికపై దూరంగా ఉన్న శ్రీనివాసవర్మను పిలిచి నరసాపురం పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాను గెలుస్తున్నట్లు వర్మ ఆయనకు చెప్పారు. "నువ్వు గెలిచిరా.. నీకు ఏం చేయాలో అది చేస్తా..." అంటూ మోదీ హామీ ఇచ్చినట్టు అప్పట్లో శ్రీనివాస వర్మ మీడియాకు చెప్పారు.. ఆ హామీ మేరకు మంత్రి పదవి ఇవ్వడం విశేషం.

ఉమ్మడి జిల్లా నుంచి కేంద్ర మంత్రులుగా..

ఉమ్మడి పశ్చిమ జిల్లా నుంచి కేంద్రమంత్రులుగా అతి కొద్దిమందికి మాత్రమే అవకాశం లభించింది. ఏలూరు నుంచి ఎంపీగా ఎన్నికైన బోళ్ల బుల్లిరామయ్య కేంద్రమంత్రిగా వ్యవహరించారు. అలాగే రాజ్యసభకు ఎంపికైన దాసరి నారాయణరావు -మిగతా 3లో..

20 ఏళ్ల తరువాత ..

నరసాపురం, జూన్ 9 : 20 ఏళ్ల తరువాత నరసాపురం పార్లమెంట్ పరిధి నుంచి ఎన్నికైన అభ్యర్థికి కేంద్ర మంత్రివర్గంలో స్థానం లభించింది. రాష్ట్ర విభజన తరువాత ఎంపీగా గెలుపొందిన శ్రీనివాసవర్మకే ఆ ఘనత దక్కింది. మరోవైపు పార్లమెంట్ ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు ఇద్దరికి మాత్రమే కేంద్ర మంత్రి వర్గంలో పదవులు దక్కాయి. అందులో తొలి మంత్రి అయిన ఘనత యూవీ కృష్ణంరాజుకు దక్కింది. 1999లో నరసాపురం పార్లమెంట్ నుంచి కృష్ణంరాజు బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించారు. 2000లో ఆయనకు కేంద్ర మంత్రివర్గంలో ఆహార సహాయ మంత్రి పదవి లభించింది. తరువాత ఏడాదికే రక్షణ సహాయ మంత్రి, మరోసారి విదేశీ వ్యవహారాల సహాయశాఖ మంత్రి పదవులు లభించింది. ఇలా ఐదేళ్లలో మూడు సార్లు మంత్రిగా కొనసాగారు. మళ్లీ 2024లో నరసాపురం నుంచి ఎన్నికైన శ్రీనివాసవర్మకు కేంద్ర కేబినేట్‌లో బెర్త్ దక్కింది.

భీమవరానికి తొలి కేంద్ర మంత్రి పదవి

భీమవరం టౌన్, జూన్ 9 : నరసాపురం పార్ల మెంట్ సభ్యుడిగా ఎన్నికైన భూపతిరాజు శ్రీనివాస వర్మకు కేంద్రమంత్రి పదవి దక్కడంతో పార్టీ కేడర్ సంబరాల్లో మునిగితేలుతోంది. పార్టీ విధేయుడుగా 34 ఏళ్ల పాటు ఆయన బీజేపీలో గుర్తింపు తెచ్చుకో వడంతో ఆయనను అందరూ బీజేపీ వర్మగా పిలుస్తుంటారు. నరసాపురం పార్లమెంట్ స్థానం నుంచి ఆయన 2 లక్షల 70 వేల మెజార్టీతో విజయపతాకం ఎగుర వెయ్యడంతో అధిష్టానంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇంతవరకు భీమవరా నికి చెందిన వారు చాలామంది పార్లమెంట్ సభ్యు లుగా ఎన్నికైనప్పటికీ ఎవరూ కేంద్ర మంత్రి పదవి దక్కించుకోలేకపోయారు. తొలిసారి 1999లో యూవీ కృష్ణంరాజుకు కేంద్ర మంత్రి పదవి లభించింది. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రిగా విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా పనిచే శారు. 2014లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా గోకరాజు గంగరాజు ఎన్నికైనా ఆయనకు మంత్రి పదవి వరించలేదు.

విద్యార్థి స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు

సామాన్య ఎగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన శ్రీనివాసవర్మకు కేంద్రమంత్రి పదవి వరిం చడం వెనుక బీజేపీలో చేపట్టిన ఎన్నో బాధ్యతలు, ప్రతిపక్ష పార్టీగా చేసిన పోరాటాలు, పార్టీ పురోగతి కోసం చేసిన కృషి, శ్రమ దాగి ఉంది. వీరి తాత గారు భూపతిరాజు -మిగతా 3లో..

భూసార పరీక్షలకు రంగం సిద్ధం

- వైసీపీ హయాంలోమట్టి పరీక్షలకు మంగళం
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కదలిక

ఏలూరు రూరల్, జూన్ 9: వ్యవసాయ రంగంలో ఆశించిన మంచి ఫలితాలు కావాలన్నా అధిక దిగుబడులు సాధించాలన్నా భూసార పరీక్షలే కీలకం. భూమి సారవంతంగా ఉంటేనే పంటలు బాగా పండుతాయి. ఈ మేరకు ఏటా సక్ర మంగా మట్టి పరీక్షలు నిర్వహించి, పోషకాల శాతంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలసాయం సాధించే అవకాశం ఉంటుంది. 2019-20లో ఒకసారి మట్టి నమూనా పరీక్షలు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రక్రియ ఆగి పోయింది. గతేడాది ఏప్రిల్‌లో మళ్లీ ప్రారంభించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా తూతూమంత్రంగా చేపట్టారు. తాజాగా కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావ డంతో వ్యవసాయ అధికారుల్లో కదలిక వచ్చింది. ఇందుకు అనుగుణంగా మండ లాలు, జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తూ ఆదే శాలు జారీ అయ్యాయి. మట్టి నమూనాలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధ మవుతున్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అగ్రి ల్యాబ్ ఏర్పాటైంది. విత్తనాలు, ఎరువులు వినియోగానికి ముందు పరీక్షలు నిర్వహించడానికి వీలుగా వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. భవనాలు నిర్మించినా ఇప్పటి వరకు మట్టి నమూనా పరీ క్షలు సేవలు లేవు. కొన్నింటిలో పరికరాలు, రసాయన సరఫరా ప్రక్రియ ఆగి పో యింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సర్వే నెంబర్‌లోనూ భూసార పరీక్షలు చేసే రైతులకు కార్డులు అందించేవారు. జింకు, జిప్సమ్ తదితరాలు రాయితీపై పం పిణీ చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అందించలేదు. మార్కె ట్లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. కూటమి అధికారంలోకి రావడంతో నే ఆర్‌కే.వి.వై ద్వారా మట్టి పరీక్షలకు సన్నద్ధతపై రైతులు హర్షం ప్రకటిస్తున్నారు.



కేంద్ర మంత్రు శ్రీనివాసవర్మ, రామ్మోహన్‌నాయుడిని ఢిల్లీలో కలసి అభినందించిన తపనా చౌదరి, ఎంపీ పుట్టా మహేష్, నాగరాజు

కేంద్ర మంత్రులను కలసిన ఎంపీ, నేతలు

ఏలూరు టూటౌన్, జూన్ 9: కేంద్ర మంత్రులుగా నియమితులైన భూపతిరాజు శ్రీనివాస వర్మ, కింజరాపు రామ్మోహన్ నాయుడిని ఢిల్లీలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామంజనేయ చౌదరి, పలువురు నేతలకు కలసి అభినందించారు. రాష్ట్రాభివృద్ధిలో శ్రీనివాసవర్మ కీలక పాత్ర వహిస్తారన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి, కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడం హర్షణీయమన్నారు. పుట్టా మహేష్ యాదవ్ .రామ్మోహన్‌నాయుడుతో పాటు పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలసి అభినందించారు. మహేష్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రానికి ఐదేళ్ల తరువాత మంచిరోజులు వచ్చాయన్నారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, చంద్రశేఖర్‌లు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు.

● పోలవరం: కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిబండి నాగరాజు ఆదివారం ఢిల్లీలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ పురందేశ్వరి, మెదక్ ఎంపీ రఘునందనరావు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలసినట్లు చెప్పారు.

జిల్లాలో వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 9: జిల్లాలో నేర నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని రాష్ట్ర, జాతీయ, ఇతర రహదారులపై శనివారం అర్థరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు గస్తీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో సారా, మద్యం అక్రమ రవాణా జరుగకుండా అరికట్టేందుకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతాల్లో కూడా ఈ తనిఖీ నిర్వహించారు. ఏటీఎం, దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద గస్తీ నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. రాత్రివేళ లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అనుమానాస్పదంగా ఉన్నవారిని గుర్తించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ఈ చర్యలను చేపట్టినట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు.

ఏలూరు మండల కళాకారుల సమావేశం



కళాకారుల మండల కమిటీ సభ్యులు

ఏలూరు రూరల్, జూన్ 9: ఏపీ సకల కళాకారుల సంక్షేమ సంఘం మండల సాధారణ సభ శ్రీహరికోటి అధ్యక్షతన ఆదివారం జరిగింది. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జువ్వి రామారావు, సెక్రటరి బి.శ్రీనివాస్, కోశాధికారి, నాట్యాచార్య డి.హేమసుందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం పేద కళాకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. పేద, వృద్ధ కళాకారులను సంఘం తరపున ఆదుకుంటూ ప్రభుత్వం నుంచి కళాకారులకు రావాల్సిన రాయితీలు వచ్చేలా కళాపోషకులు, ప్రభుత్వ అధికారుల సహకారంతో కృషి చేస్తామన్నారు. అనంతరం ఏలూరు మండలం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శ్రీహరికోటి, కార్యదర్శిగా కాసా సాంబశివరావు, కోశాధికారిగా నాట్యాచార్య, నీలి సెర్వాణి, వివిధ కళారంగాల ప్రతినిధులతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విజ్ఞాన ఖని గ్రంథాలయం



పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, జూన్ 9: గ్రంథాలయం అంటే విజ్ఞాన అని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి గ్రంథపఠనం చేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు సృజనాత్మకతను పెంచే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థిలో అంతర్లీనంగా ఉండే కళలు వెలికివస్తాయని చెప్పారు. చదువుతోపాటు గ్రంథ పఠనం చేయడం విద్యార్థి ఉన్నతికి దోహదపడుతుందని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథ పఠనం చేయాలన్నారు.

18 నుంచి డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

చింతలపూడి, జూన్ 9: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి ఈనెల 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. చింతలపూడి డిగ్రీ కళాశాలలో బీఎస్సీలో ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, బోటనీ, బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, హార్టికల్చర్ ఒకేషనల్ కోర్సులున్నాయని తెలిపారు. మూడేళ్ల డిగ్రీ పూర్తయిన విద్యార్థులు నాలుగో సంవత్సరం కెమిస్ట్రీ పూర్తి చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. గత ఏడాది ఈ కళాశాల నుంచి 58మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.



కోలాట ప్రదర్శనతో అలరించిన బాలికలు

అలరించిన బాలికల కోలాట ప్రదర్శన

పోలవరం, జూన్ 9: అరుదైన సంప్రదాయ నృత్యం కోలాటం కార్యక్రమం శనివారం రాత్రి పోలవరం పంచాయతీ బీసీ కాలనీలో వినాయకుని ఆలయం వద్ద నిర్వహించారు. తాళ్ళపూడి కోలాటం గురువు చల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వంద మంది కోలాటం నృత్య కళాకారులైన బాలకలకు సామూహిక గజ్జె పూజ నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి పూజ, కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు.



ప్రత్యేక అలంకారాల్లో కుంకుళ్లమ్మ

ద్వారకా తిరుమల, జూన్ 9: క్షేత్ర దేవతగా విరాజిల్లుతున్న కుంకుళ్లమ్మ అమ్మవారు ఆదివారం ప్రత్యేక పుష్పాలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి ఆలయానికి వచ్చి దర్శనానంతరం భక్తులు స్వగ్రామాలకు వెళ్లే క్రమంలో కుంకుళ్లమ్మను దర్శిస్తారు. ఈక్రమంలో పలువురు భక్తులు ప్రత్యేక పుష్పాలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.



రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి జూన్ 9: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పాలపొంగలి నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి సత్యనారాయణ శర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్య శర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన చేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.



వైద్య భగవానుడికి అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 9: పవరుపేట ధన్వంతరి వైద్య భగవానుని ఆలయంలో స్వామి వారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సామూహికంగా అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. సూర్య నమస్కార పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులతో పూజలు చేయించారు. ఈ మేరకు ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.



ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులకు సత్కారం



చింతలపూడిలో టీడీపీ అభిమానుల విజయ నినాదం



దెందులూరు మండలం కొవ్వలి గ్రామస్తులతో నవ్యశ్రీ



కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురంలో జనసేన శ్రేణులు

విజయోత్సవం

కూటమి శ్రేణుల ర్యాలీ, మొక్కుల చెల్లింపు

ఏలూరులో ఎమ్మెల్యే బడేటి పూజలు

ఏలూరు టూటౌన్, జూన్ 9: కూటమి ఘన విజయంతో జిల్లాలో పలు చోట్ల నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి, ఆలయంలో మొక్కులు చెల్లిస్తున్నారు. ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు ఆదివారం మెహర్ బాబా ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పట్టా సుబ్బారావుతోటలో ఎమ్మెల్యే చంటి దంపతులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. యువతను గంజాయి మత్తులో దించేవారిని ఏ పార్టీ వారైన సహించేది లేదని కఠిన చర్యలు తప్పవన్నారు. రెండు నెలల వ్యవధిలో గంజాయిని అరికట్టేందుకు కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నానన్నారు. బాధ్యత గల ప్రజలు పూర్తి సహకారం అందించాల న్నారు. తనని ఆదరించిన ప్రతీ ఒక్కరిని గుర్తు పెట్టుకొని తగు న్యాయం చేస్తానని అన్నారు. వైసీపీ పాలనలో గంజాయి ఇబ్బడి ముబ్బడిగా దొరకడంతో యువత భవిష్యత్ అంధకారంలోకి వెళ్లిపోయిందన్నారు. ఎంతో మంది యువకుల జీవితాలను గంజాయి నాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బడేటి చంటి, మీనా దంపతులకు ఘనంగా సన్మానించారు. మెహర్‌బాబా ఆలయంలో చంటి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మరడాని రంగారావు, బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎంవీఎస్.శర్మ, రాజశేఖర్, విజయలక్ష్మి, డాక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను నా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఆదివారం ఎమ్మెల్యే చంటిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ సమస్యలు తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాగబాబు, వై.శివకుమార్, అశోక్, గంటా జానకిరామ్, రవీంద్ర, వెంకన్న బాబు, జగదీశ్, మల్లేశ్వరరావు, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ అభిమానులు

చింతలపూడి: కూటమి తెలుగుదేశం అఖండ మెజార్టీ సాధించడంతో రాట్నాలకుంట ఆలయంలో మొక్కు తీర్చుకున్నట్లు ఏలూరు జిల్లా సాధికార సమితి కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు తెలిపారు. నగర సాధికారసమితి చింతలపూడి నియోజకవర్గ సభ్యుడు గార్లపాటి వెంకన్న, మాజీ ఎంపీటీసీ కొనకళ్ళ వీర్రాజు, చక్రపు మారేశ్వరరావు, చిమటా తిరుపతిరావు, రాచకొండ రాంబాబు, కుప్పాల జగదీష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, ఏలూరు ఎంపీగా పుట్టా మహేష్‌కుమార్, చింతల పూడి ఎమ్మెల్యేగా సొంగా రోషన్‌కుమార్ అఖండ విజయం సాధించాలని, 108 కొబ్బరికాయలు కొడతామని కార్యకర్తలు మొక్కుకున్నారు. తడికలపూడి గాంగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తొలుత స్వామివారికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తూతా లక్ష్మణరావు, బొంతు వెంకటేశ్వరరావు, బొప్పన అంజయ్య, మేరుగు సుందరరావు, మొట్టికాయల నాగయ్య బలుసు సాయి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం..

దెందులూరు: విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుని వెళ్లి దెందులూరును ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రణాళికతో ముందుకు వస్తున్నారని ఆయన కుమార్తె నవ్యశ్రీ అన్నారు. పోతునూరులో ఆదివారం ఆమె ఇంటింటికి తిరిగి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త సాంబశివరావు, బోడేటి మోహన్‌బాబు, నున్న లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో నవ్యశ్రీని ఘనంగా సన్మానించారు. అనంతరం కొవ్వలి రాజులపేటలో టీడీపీ వెలమాటి అనిల్, కసుకుర్తి రామకృష్ణ, గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో నవ్యశ్రీని ఘనంగా సన్మానించారు. గుత్తా రాజా, వడ్లపట్ల పండు, వెలమాటి అశోక్ చక్రవర్తి, పుట్టా రాజేష్, నెరుసు వెంకటసుబ్బయ్య, మల్లవరపు రంగారావు, కట్టా కృష్ణ, గోవాడ నాగరాజు పాటు టీడీపీ జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ ర్యాలీలు

కొయ్యలగూడెం: కూటమి విజయంతో జనసేన, టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని సీతంపేట, సరిపల్లి, గవరవరం, అచ్యుతాపురం గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలు ప్రజాతీర్పు ఇచ్చారని మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. కూటమి పార్టీలు కలిసి మెలసి పని చేయాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. జనసేన నాయకులు దుగ్గిన శ్రీను, వినోద్, గంగాధరం, సోమయ్య బాబు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

అప్పలనాయుడుకు ఆత్మీయ సత్కారం

ఏలూరు కార్పొరేషన్: ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి నిరంతరం కృషి చేసిన జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడును నగరంలోని యువకులు చెంచుల కాలనీలోని అప్పలనాయుడు నివాస గృహం వద్ద ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందచేసి ఆత్మీయ సత్కారాన్ని నిర్వహించారు. అప్పలనాయుడు మాట్లాడుతూ యువకులంతా ఐకమత్యంగా ఉండాలని, ఎటువంటి వివాదాలకు వెళ్ళవద్దని, పార్టీ పురోభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జనసేన నాయకులు సరిది రాజేష్, పల్లి విజయ్, భూపతి ప్రసాద్, దాసరి బాబి, రెడ్డి గౌరీశంకర్, రవి, పైడి లక్ష్మణరావు, బోండా రాముసాయుడు, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



మోదీ ప్రమాణస్వీకారం సందర్భంగా ఏలూరులో బీజేపీ శ్రేణుల సందడి



లింగపాలెం మండలంలో కేక్ కట్‌చేస్తున్న బీజేపీ నాయకులు

మోదీ పాలనలో మరింత అభివృద్ధి

ఏలూరు టూటౌన్, జూన్ 9: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, రానున్న ఐదేళ్లలో మరింత అభివృద్ధి పథంలో మోదీ నడిపిస్తారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కర రావు అన్నారు. మూడోసారి మోదీ ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా శాంతినగర్‌లో బీజేపీ శ్రేణులు, అభిమానులు స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. అనంతరం జి.వెంకట్రామయ్య మాట్లాడుతూ ప్రధాని మోదీ ఓటమి ఎరగని ప్రపంచస్థాయి నాయకుడని కొనియాడారు. మోదీ పాలనలో దేశం ప్రపంచంలోనే అత్యుత్తమ స్థాయికి ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో విజయరామరాజు, టీ.రామచంద్రరాజు, ఆదినారాయణ, ఉపేంద్ర, అప్పారావు, దామోదర్, బోస్, డోమ్ని, రామ్మోహన్, సూర్యనారాయణరాజు, భాస్కరరావు, రమేష్, సీహెచ్.గణపతి తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: బీజేపీ సంక్షేమ పథకాలే మోదీని ప్రజలకు చేరువ చేశాయని, బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చేలా చేశాయని, రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు రాయంకుల చక్రధర్‌రావు అన్నారు. లింగపాలెం మండలం మఠంగూడెంలో రాయంకుల చక్రధర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం సంతోషమన్నారు. పేదల అభ్యున్నతిపై బీజేపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మోదీని మరోసారి గద్దెనెక్కేలా చేశాయన్నారు. కేంద్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన రాష్ట్ర ఎంపీలకు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, కొత్తూరు పుల్లయ్య, ఎస్వి నాగేశ్వరరావు, జయరాజ్, పలువురు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: దేశ ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పోలాసిగూడెంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సందడి చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు కాకి చంటి, ఒంటెద్దు ఏసువరప్రసాద్, చెలికాని భాస్కరరావు తదితరులు ఉన్నారు. తొలుత విజయోత్సవ ర్యాలీ నిర్వహించి భారతమాత చిత్రపటానికి పూలమాల వేశారు.

● ఏలూరు కార్పొరేషన్: దేశ ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జనసేన కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బాణసంచా కాల్చి సందడి చేశారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు, బివిరాఘవయ్యచౌదరి,సిరిపల్లిప్రసాద్, నగిరెడ్డి కాశీ నరేష్, పరిది రాజేష్, బొత్సా మధు, శ్రావణ్ గుప్తా,రెడ్డి గౌరీ శంకర్,నిమ్మల శ్రీను, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఎంపీలకు మంత్రి పదవులు ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలియజేశారు.



పందెం గెలిచినా..

సొమ్ము పోయె!

ఆచూకీ లేని మధ్యవర్తులు

లబోదిబోమంటున్న పందెంరాయుళ్లు

ఎన్నికల ఫలితాలతో జీవితాలు తారుమారు

పెదవేగి, జూన్ 9: సార్వత్రిక ఎన్నికలు ఉత్కంఠ రేకెత్తించాయి. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు కూటమికి ఏకపక్షంగా రావడంతో పందె కాసిన పలువురు బికారులయ్యారు. పందెం గెలిచిన వారు కూడా సొమ్ము అందక లబోదిబోమంటున్నారు. ఎవరికివారు తమ పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తారు. పందెం కాస్తే అయాచితంగా లక్షలు వస్తాయనే ఆశతో లక్షలాది రూపాయలు పందెం కట్టారు. కొంతమంది పందెం ఓడిపోయి ఉన్న ఆస్తులను అమ్ముకుని, బికారులుగా మారగా, మరికొంతమంది పందెం గెలిచి కూడా కట్టిన సొమ్ము చేతికి రాక అవస్థలు పడుతున్నారు. ఓట్ల లెక్కింపునకు ముందు చాలామంది మధ్యవర్తుల వద్ద పందెం సొమ్ము కట్టారు. ఇరుపక్షాల కలసి పందెపు సొమ్మును మధ్యవర్తి దగ్గర ఉంచారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత పందెం సొమ్ముకోసం వెళ్లిన వారికి మధ్యవర్తి అడ్రస్ లేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో లబోదిబోమంటూ వెతుకులాట ప్రారంభించినా వారి జాడ కనిపించక పందెపు సొమ్ము రాక ఎదురు చూస్తున్నారు.

దెందులూరు నియోజకవర్గంలో నలుగురైదుగురు మధ్యవర్తుల దగ్గర దాదాపు రూ.20 కోట్లకు పైగా పందెపుసొమ్ము ఉన్నట్లు చెబుతున్నారు. ఒక వ్యక్తి రూ.ఐదుకోట్లతో పరారయ్యాడని, తాను కట్టిన రూ.12.50లక్షల నగదు, పందెంలో తనకు రావాల్సిన రూ.పది లక్షల మాటేమిటో అర్థం కావడంలేదని ఒకరు దిగాలుగా చెప్పారు. మధ్యవర్తిని నమ్మి కోట్లలో సొమ్మును అతనివద్ద ఉంచితే అతను ఆ సొమ్మును వేరొక పందెంలో కాయడం, ఆ పందెం కాస్తా పోవడంతో అతడు పరారయ్యాడని అనుకుంటున్నారు. దీంతో పందెం గెలిచిన వ్యక్తులు కూడా సొమ్ము చేతికందక అవస్థలు పడుతున్నారు. అప్పుచేసి పందెం కాశామని ఒకరు.. పది రూపాయల వడ్డీకి తెచ్చామని మరొకరు.. బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టిన సొమ్ముతో పందెం కట్టామని ఇంకొకరు.. భూమి పత్రాలను తనఖా పెట్టామని వేరొకరు.. ఇలా పలువురు తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. మధ్యవర్తి వచ్చిన తర్వాతైనా ఆ సొమ్ము వస్తుందనే గ్యారంటీ లేదని పందెపురాయుళ్ళు వాపోతున్నారు. పందెం గెలిచికూడా సొమ్ము పోగొట్టుకోవడం అంటే అంతకంటే దురదృష్టం ఇంకొకటి ఉండదని ఒకరినొకరు ఓదార్చుకుంటున్నారు.

కాగా పందెం సొమ్ము తన దగ్గర పెట్టుకున్న మధ్యవర్తుల్లో ఇద్దరు, ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారని సమాచారం వారి దగ్గర పెట్టిన సొమ్ము ఇక రానట్లేనని పందెపు రాయుళ్ల దిగాలు పడుతున్నారు. పెదవేగి మండలానికి చెందిన ఒకరు తన దగ్గర పెట్టిన పందెపు సొమ్మును మరొక పందెంలో పెట్టి మొత్తం పోగొట్టుకున్నట్లు తెలిసింది. సొమ్ము తిరిగి ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో పరారయ్యాడు. ఐదురోజుల తరువాత తిరిగొచ్చిన అతడు తనకున్న రెండెకరాల భూమిని విక్రయించి, పందెం సొమ్మును కట్టడతానని పెద్దల సమక్షంలో ఒప్పందం జరిగినట్లు సమాచారం.

2019లో జరిగిన ఎన్నికల్లోనూ మధ్యవర్తుల మాయాజాలంతో ఒక కుటుంబం మాటకు కట్టుబడి వారి ఆస్తులను విక్రయించి, కుదేలయ్యారు. ఆరోజున ఆ కుటుంబం నేను ఇవ్వను అంటే చేసేది ఏమీ లేదని,. కానీ మధ్యవర్తికి సొమ్ము ఇప్పించే విషయంలో ఆ కుటుంబం మొత్తం ఆస్తులను పోగొట్టుకుంది. ఇలా పందేలు ఎంతోమంది జీవితాలను సర్వనాశనం చేశాయి. తాజా ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గంలో తన స్థాయిని మించి పెందేలు కాసి, పందేలు ఓడి, సొమ్ము కట్టలేక ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడడం విషాదం.



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు

రామోజీరావు మృతి తీరని లోటు

ఏలూరు రూరల్, జూన్ 9: స్థానిక కేపీడీటీ స్కూల్‌లో అశోక్‌నగర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం చెరుకూరి రామోజీరావు సంస్మరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రామోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు వీఎస్‌ఆర్ ప్రసాద్, అశోక్‌నగర్ వాసు రామోజీరావు సేవలను కొనియాడారు. ఎంతోమందికి ఉపాధికల్పించిన రామోజీరావు మృతి తీరని లోటన్నారు. యాదవ సంఘం జిల్లా నాయకులు సంతాపం తెలిపారు. అనేక సామాజిక సమస్యలపై అక్షరమే ఆయుధంగా పోరాటం చేసిన యోధుడు అని కొనియాడారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు శ్రీనివాసరావు, గొర్ల రామారావు, చిట్టిబోయిన సాయిబాబు, బొట్టా అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 9: ఆరోగ్య పరిరక్షణకు ఏటా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయుష్ హాస్పిటల్స్ వైద్యుడు భానుకిరణ్ సూచించారు. కత్తెపువీధి జామియా మసీదులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల వయస్సు పైబడిన వారంతా కనీసం ఏడాదికోసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. ప్రస్తుత వేగవంతమైన సమాజంలో ఒత్తిళ్ళు, జంక్‌ఫుడ్స్, తగిన వ్యాయామం లేకపోవడం, మితిమీరి మొబైల్ ఫోన్ వినియోగంవల్ల వివిద శారీరక, మానసిక రుగ్మతలబారిన పడుతున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంటోందన్నారు. మొత్తం 274మందికి షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలుచేసి మందులను అందజేసారు. ఆయుష్ హాస్పిటల్ మేనేజర్ కాశీనాథ్ జాస్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోషన్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఏలూరు బిషప్ పొలిమేర జయరావు

ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు జయరావు సత్కారం

కామవరపుకోట, జూన్ 9: చింతలపూడి ఎమ్మెల్యేగా గెలుపొందిన సొంగా రోషన్ కుమార్‌ను ఏలూరు బిషప్ పొలిమేర జయరావు, ఫాదర్స్ ఆదివారం ఆహ్వానించారు. రోషన్‌కుమార్ బిషప్ కార్యాలయానికి వెళ్ళగా ఆయనను బిషప్ జయరావు సత్కరించారు. ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు.

లయన్స్ జిల్లా ప్రతినిధుల సమావేశం



లయన్స్ డైరెక్టరీ ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఏలూరు రూరల్, జూన్ 9: లయన్స్ జిల్లా భవనంలో జిల్లా సమావేశం కాకరాల వేణుబాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. వచ్చే ఏడాది చేపట్టవలసిన సేవా కార్యక్రమాలు వివరించారు. ఆకలి, పర్యావరణ కాలుష్యం, చిన్నపిల్లలకు క్యాన్సర్, కంటిచూపు, మధుమేహం, తరిగిపోతున్న మానవత్వ విలువలు తదితర సమస్యలపై దృష్టిసారించాలని సూచించారు. గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ ఈ ఏడాది అంతా సేవలు అందించిన సేవామూర్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వంకా రవీంద్రనాథ్, ఎన్‌వీవీఎస్ పాపారావునాయుడు, డి.సుబ్బారావు, పి.సుభాష్‌బాబు, వి.కె పంకజాక్షన్, ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్తా

కామవరపుకోట, జూన్ 9: చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి సాగు, తాగునీరు పుష్కలంగా అందజేయాలని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ అన్నారు. ఆదివారం టి.నరసాపురం మండల నేతలు రామకృష్ణగౌడ్, జయవరపు శ్రీరామ్మూర్తి, బొంతు సత్యనారాయణ తదితరులు చింతలపూడి ఎత్తిపోతల సమస్య ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

భౌబోయ్

కుక్కల గుంపు స్వైర విహారం

పోలవరంలో భయం భయం

పోలవరం, జూన్ 9: మండల కేంద్రంలో గుంపులు గుంపులుగా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామస్థులతో పాటు వాహనదారులు, పాడి పశువుల రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం గంగా భవాని థియేటర్, పంచాయతీ కార్యాలయం, ఏటిగట్టు, యడ్లగూడెం సెంటర్ల వద్ద వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ద్విచక్ర వాహనాల వెంటపడి తరుముతున్నాయి. రెండు రోజుల క్రితం భాను థియేటర్ సెంటర్‌లో ఒక జంట ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కుక్కలు వెంటపడడంతో వాహనం అదపుతప్పి ఇద్దరూ గాయాలపాలయ్యారు. నాలుగు రోజుల క్రితం యడ్లగూడెం చికెన్ షాపుల సెంటర్‌లో బైకుపై వెళుతున్న వ్యక్తిని కుక్కలు వెంటపడి తరిమి బైకుపై నుంచి కిందపడేలా చేసి గాయపరిచాయి. గుంపులుగా సంచరిస్తున్న ఊరకుక్కలు మెయిన్ రోడ్డుకిరువైపులా చికెన్ సెంటర్ల వద్ద కోళ్ల వ్యర్థాలను తింటూ రోడ్లపై సంచరిస్తున్నాయి. ఆ మార్గం లో వెళుతున్న పసిపిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, మేకలు ఆవులు పాడి పశువులపై దాడులకు పాల్పడుతున్నాయి.

నాలుగు రోజుల క్రితం కమ్మరగూడెం రైతుకు చెందిన మేకపై ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో దాడికి పాల్పడి చంపివేశాయి. మాంసాహారానికి రుచి మరిగిన వీధికుక్కలు పెరటి కోళ్లను, ఆవుదూడలను, మేకలను సైతం చంపుకుతింటున్నాయని, పలువురు వాపోతున్నారు. పాఠశాల శెలవులు పూర్తి కానున్న నేపథ్యంలో పిల్లలను స్కూలుకు పంపాలంటే భయంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళ చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద వదిలించాలని గ్రామస్థులు, వాహనదారులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

